@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
AP EDITION
మన మీ వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
ఆదివారం 30 ఆగస్టు 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే



- వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి: రాహుల్ డిమాండ్
- ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడంపై రాహుల్ ఆగ్రహం
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టాలని డిమాండ్
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ వైఖరి అంటరానితనానికి మరో రూపం

## ఎల్ఓసీ వద్ద పాక్ డ్రోన్ కలకలం



- సరిహద్దు వెంబడి బలగాల ముమ్మర గాలింపు
- మెంధర్ సెక్టార్‌లోని బాలాకోట్ ప్రాంతంలో డ్రోన్ గుర్తింపు
- సరిహద్దు దాటి పాక్ వైపు వెళ్లినట్లు అధికారుల వెల్లడి
- అనుమానాస్పద కదలికలపై ఉధంపూర్, కతువా, రాజౌరిలోనూ సెర్చ్ ఆపరేషన్లు



## మహా విధ్వంసం

- ప్రళయం మిగిల్చిన విషాదం
- సర్వం కోల్పోయి, గల్లంతైన ఆప్తుల కోసం అన్వేషిస్తున్న నేపాల్‌లోని కుటుంబాలు
- నేపాల్ ఆకస్మిక వరదలు
- 600 దాటిన మృతుల సంఖ్య
- శవాల ఫొటోల వద్ద కుటుంబాల రోదనలు
- మరోవైపు ఆసుపత్రుల వెలుపల, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను చూసేందుకు కుటుంబాలు బారులు తీరుతున్నాయి


# గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు



- మీ హెల్త్ మీ ఫోన్‌లోనే
- గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిది
- అల్లూరి జిల్లా అరకులోయ మండలంలో సీఎం చంద్రబాబు పర్యటన
- గన్నెలలో 10 ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఏజెన్సీలో సంజీవని కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం

**అమరావతి**

ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరు జిల్లా అరకులోయ మండలం గన్నెలలో 10 ఆరోగ్య రథాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఏజెన్సీలో సంజీవని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అరకులోయ మండలం గన్నెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. ఆ రోజుల్లోనే ఆయుర్వేద వైద్యం గిరిజనులకు అందించిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని గుర్తు చేశారు. ఆయన సేవలకు గుర్తుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టామని స్పష్టం చేశారు. "సంజీవని" యాప్ ఓ గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. మీకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి - మిగతా3లో



## మరో నాలుగు లక్షల కొత్త ఇళ్లు మంజూరు

- మరో 10 రోజుల్లో పూర్తి కానున్న ప్రక్రియ
- కొత్తగా 4 లక్షల గ్రామీణ ఇళ్లు
- వారం, పది రోజుల్లో మంజూరుకు అవకాశం
- పీఎంఏవై 2.0 కింద ఇచ్చేందుకు కేంద్రం సుముఖం

## బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై డబ్ల్యూహెచ్ఓ అలర్ట్

- భారత్ అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు సూచన
- భారత్‌లో పెరుగుతున్న స్వైన్‌ఫ్లూ వ్యాప్తి
- అంతలోనే బర్డ్‌ఫ్లూ అలర్ట్ ఇచ్చిన ప్రపంచ ఆరోగ్య సంస్థ
- భారత్ వన్ హెల్త్ విధానాన్ని బలోపేతం చేయాలని సూచించిన ఆరోగ్య నిపుణులు



## ఎంబీబీఎస్, బీడీఎస్ ఫీజులు 10 శాతం పెంపు



- వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలో వసూలు చేయాల్సిన ఫీజులను ప్రకటించిన ప్రభుత్వం
- సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం ఫీజు పెంపుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు
- వైద్యవిద్య కోర్సుల ఫీజులు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్

**అమరావతి**

రాష్ట్రంలో వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలో వసూలు చేయాల్సిన ఫీజులను ప్రభుత్వం ప్రకటించింది. తొలి విడత కౌన్సెలింగ్ నిర్వహణకు దీనితో మార్గం సుగమమైంది. గతేడాదితో పోలిస్తే ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు 10 శాతం, పీజీ మెడికల్ కోర్సులకు 15 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో వైద్య విద్య కోర్సులకు ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులను నిర్ణయించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు గతేడాది కంటే 10 శాతం, పీజీ కోర్సులకు, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు 15 శాతం ఫీజు పెంపుదల చేస్తున్నట్టు ఉత్తర్వులు వెలువరించారు. ఎంబీబీఎస్ కన్వీనర్ - మిగతా3లో



## హిమాలయాల్లో 'మంచు' ముప్పు

- భారత్‌లో 195 హైరిస్క్ సరస్సులు
- బద్దలైతే జలప్రళయమే!
- హిమాలయాల్లో 7,500 హిమానీనద సరస్సులు
- భారత్‌లో 195 సరస్సులు అత్యంత ప్రమాదకరంగా గుర్తింపు
- సిక్కింలోనే 25 హైరిస్క్ సరస్సులు
- గంగా పరివాహక ప్రాంతంలో 4,700 సరస్సులు

# ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొనేలా..

- పిల్లల చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి
- అమరావతి ఛాంపియన్ షిప్ ముగింపు కార్యక్రమం
- వేడుకల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు
- విజేతలకు నగదు బహుమతిని అందజేసిన ప్రముఖులు



**అమరావతి**

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం శ్రీనివాస ఆడిటోరియంలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర నలు మూలల నుంచి వచ్చిన క్రీడాకారుల సందడితో ఆడిటోరియం క్రీడా సంబరాలను తలపించింది. విజేతలకు నగదు బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేయడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటాలకు నివాళులర్పించారు. రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్‌లో విజేతలైన క్రీడాకారులకు - మిగతా3లో

# మహా విధ్వంసం



ఆసుపత్రుల వెలుపల గోడలకు అంటించిన మృతుల ఫొటోలను చూస్తూ కన్నీరుమున్నీరు అవుతున్న జనాలు. తమ సామగ్రి కోసం బురదలో, శిథిలాల మధ్య వెతుకుతున్న కుటుంబాలు. దెబ్బతిన్న భవనాల గుండా పసిబిడ్డను ఎత్తుకొని వెళ్తున్న ఓ బాధిత మహిళ. శిథిలాల మధ్య పడి ఉన్న ఓ కుక్క కళేబరం. నేపాల్?ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు సృష్టించిన బీభత్సానికి ఇవి కొన్ని సజీవ సాక్ష్యాలు. మరోవైపు రోజులు గడుస్తున్న కొద్దీ గల్లంతైన వారి బంధువుల్లో ఆశలు ఆవిరి అవుతున్నాయి. మరోవైపు సహాయక బృందాలు అత్యంత ప్రతికూల వాతావరణంలోనూ ప్రాణాలకు తెగించి బాధితుల కోసం గాలిస్తున్నాయి. బుధవారం నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు ఒక్కసారిగా గ్రామాలు, పట్టణాలను ఊడ్చేసింది. వరద ఉద్ధృతికి ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు అన్నీ కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పెను విపత్తు నుంచి కోలుకోవడానికి ఇప్పుడు నేపాల్ తీవ్రంగా శ్రమిస్తోంది.

**భారీగా పెరిగిన మృతుల సంఖ్య**

శనివారం నాటికి నేపాల్‌లో మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2400 మంది గల్లంతయ్యారు. పైగా వరద ప్రభావిత ప్రాంతాల్లో తరచూ వర్షాలు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ రెస్క్యూ బృందాలు ఎంతో శ్రమించి 163 మంది విదేశీయులతోపాటు, దాదాపు 2500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు ఆసుపత్రుల వెలుపల, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను చూసేందుకు కుటుంబాలు బారులు తీరుతున్నాయి. తమకు తెలిసిన వారు ఎవరైనా ఉన్నారేమోననే ఆశతో పేర్లు, ఫొటోలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు. బతికున్న వారి జాబితాలో తమ వారి పేర్లు కనిపించకపోవడంతో, భారమైన హృదయంతో, మరణించిన వారి ఫొటోలు ఉన్న మరో జాబితా వైపు వెళ్తున్నారు. ఈ హృదయవిదారకమైన దృశ్యాలు చూపరులను కన్నీటి పర్యంతం చేస్తున్నాయి. కాగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ సిబ్బంది రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా శ్రమిస్తున్నారు. వర్షాలను సైతం లెక్కచేయకుండా, బురదను తవ్వుకుంటూ గల్లంతైన వారి కోసం అన్వేషిస్తున్నారు.

అప్పర్ త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్ట్ వద్ద వందలాది మంది కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అక్కడ టన్నుల కొద్దీ బురద పేరుకుపోయింది. నేపాల్ హోంమంత్రి సుదన్ గురుంగ్ స్వయంగా ప్రొక్లెయిన్లతో ఆ బురద తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఆ టన్నెల్‌లో చిక్కుకుపోయిన 350 మందిని నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు ఆన్?లైన్ ఖబర్? అనే న్యూస్ పోర్టల్ పేర్కొంది.

మధ్య నేపాల్‌లోని గ్రామాల్లో విధ్వంసం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. భవనాలు కొన్ని అడుగుల మేర బురదలో మునిగిపోయాయి. వాహనాలు సగం వరకు బురదలో కూరుకుపోయాయి. రోడ్లు, ఇతర మౌలిక వసతులు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. ఇక ప్రాణాలతో బయటపడిన వారికి, ఉండడానికి ఓ చోటు, వైద్యం, పోయిన సామగ్రి వెతుక్కోవడం కష్టమైపోతోంది. నువాకోట్ జిల్లాలోని దేవిఘాట్ గ్రామంలో ప్రజలు మోకాళ్ల లోతు బురదలో, శిథిలాల గుండా నడుస్తూ తమ వస్తువుల కోసం వెతుకుతున్నారు. ఒక వ్యక్తి శిథిలాల గుండా గ్యాస్ సిలిండర్? మోసుకెళ్తున్నాడు. ఎందుకంటే అతను ఆ ముంపు నుంచి కాపాడుకోగలిగిన ఏకైక వస్తువు అది ఒక్కటే. ఎక్కడ చూసినా దెబ్బతిన్న ఇళ్లు, విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, పాడైపోయిన వాహనాలు కనిపిస్తున్నాయి. ఇది వరద సృష్టించిన మహా విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ప్రస్తుతం త్రిశూలిలో ఏర్పాటు చేసిన ఆర్మీ రిలీఫ్ క్యాంప్ బాధితులకు కాస్త ఆసరాగా మారింది. ఆర్మీ సిబ్బంది పిల్లలకు, వృద్ధులకు సాయం చేస్తున్నారు. వైద్యులు తాత్కాలిక వైద్య శిబిరాల్లో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. ఈ క్యాంప్?ల్లోనే గల్లంతైన, మరణించిన, రక్షించబడిన వారి వివరాలను అందిస్తున్నారు. సహాయక చర్యల కోసం 5000 మందికిపైగా నేపాల్ ఆర్మీ సిబ్బందితో కలిపి మొత్తం 11వేల మందికిపైగా భద్రతా సిబ్బంది రంగంలోకి దిగారు.

**మళ్లీ వర్షాలు కురిసే అవకాశం!**

వాతావరణ శాఖ రానున్న రోజుల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి. ఇది రెస్క్యూ సిబ్బంది పనిని మరింత కష్టతరం చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ, గతంలో ఇలాంటి విపత్తులను ఎదుర్కొన్న అనుభవంతో, గల్లంతైనవారిని వెతకడం, బాధితులకు సహాయం చేయడం, పునర్నిర్మాణ ప్రక్రియను ప్రారంభించడంపై నేపాల్ దృష్టి సారించింది.

# హిమాలయాల్లో 'మంచు' ముప్పు



నేపాల్‌లో ఇటీవల సంభవించిన హిమానీనద విపత్తు భారత్‌కు మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. హిమాలయ పర్వతాల్లోని మంచు సరస్సులు బద్దలైతే ఎంతటి విధ్వంసం సంభవిస్తుందో నేపాల్ ఘటన స్పష్టం చేస్తోంది. అదే సమయంలో భారత్‌లో కూడా వందల సంఖ్యలో ప్రమాదకర హిమానీనద సరస్సులు ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దీంతో వాటిపై నిరంతర నిఘా, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ సర్వే ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలో దాదాపు 7,500 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వీటిలో సుమారు 10 శాతం కంటే దాదాపు 750 సరస్సులు సిక్కింలోనే ఉన్నట్లు అంచనా. వీటిలో 25 సరస్సులను అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించారు. హిమాలయ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు కరుగుదల, వర్షపాతంలో మార్పులు వంటి పరిణామాలు ఆ సరస్సులపై ప్రభావం చూపుతున్నాయి.

**దిగువ ప్రాంతాల్లో విధ్వంసం!**

హిమానీనదాల నుంచి కరిగిన మంచు, నీరు చేరి ఏర్పడే సరస్సులు కాలక్రమంగా భారీగా విస్తరించే అవకాశం ఉంటుంది. సరస్సులను చుట్టుముట్టిన మంచు, రాళ్ల గోడలు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు రావచ్చు. దీనినే గ్లేషియల్ లేక్ ఔట్?బర్స్ట్?ఫ్లడ్(+శ్రీూఖీ) అంటారు. ఇలాంటి వరదలకు భారీ నీటితోపాటు మట్టి, రాళ్లు, మంచు కూడా కలవడంతో దిగువ ప్రాంతాల్లో విధ్వంసం మరింత పెరుగుతుంది. అయితే భారత్?లో హిమానీనద సరస్సుల ముప్పు సిక్కింకే పరిమితం కాదు. గంగా నదీ పరివాహక ప్రాంతంలోనే సుమారు 4700 సరస్సులు ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఆ నదీ పరివాహక ప్రాంతం 2.5 లక్షల చదరపు కిలోమీటర్లకుపైగా విస్తరించి ఉంది. వీటిలో ఏదైనా అత్యంత ప్రమాదకర సరస్సు ఒక్కసారిగా బద్దలైతే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర కీలక మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో లోయలు ఇరుకుగా ఉండటంతో వరద ప్రవాహం మరింత వేగంగా కిందకి దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది.

**సౌత్ లొనాక్ విపత్తు మర్చిపోలేం**

భారత్ ఇప్పటికే ప్రమాదాన్ని చవిచూసింది. 2023 అక్టోబర్ 3వ తేదీన సిక్కింలోని సౌత్ లొనాక్ సరస్సులు వద్ద భారీ విపత్తు సంభవించింది. సరస్సులోకి భారీగా మంచు, రాళ్లు విరిగిపడటంతో ఒక్కసారిగా పెద్ద అల ఏర్పడింది. సుమారు 20 మీటర్ల ఎత్తున ఎగిసిన ఆ నీటి అల దిగువ ప్రాంతాల వైపు దూసుకెళ్లింది. ఆ వరద ప్రవాహానికి జల విద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, రహదారులు, నివాస ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ ఘటన హిమానీనద సరస్సుల ప్రమాద తీవ్రతను దేశం ముందు స్పష్టంగా ఉంచింది.

నేపాల్‌లో జరిగిన తాజా విపత్తు మరో కోణాన్ని బయటపెట్టింది. మంచు లేదా రాళ్లు విరిగిపడటం, ఆ తర్వాత భారీగా మట్టి, రాళ్ల ప్రవాహం ఏర్పడటం, తాత్కాలికంగా సరస్సు ఏర్పడటం, చివరకు ఆకస్మిక వరదగా మారడం, ఇలా ఒకదాని తర్వాత ఒకటి వరుసగా జరిగే ప్రమాదాలను క్యాస్కేడింగ్ హజార్డ్స్ అంటారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సభ్యుడు కృష్ణ వత్స ప్రకారం, ఇలాంటి పరిణామాలు చాలా వేగంగా చోటుచేసుకోవచ్చు. దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయడానికి చాలా తక్కువ సమయం ఉండే అవకాశం ఉంది. "ప్రస్తుతం హిమాలయాల్లో సుమారు 200 హిమానీనద సరస్సులు ఉండగా, వాటిలో కనీసం 50 నుంచి 60 వరకు అధిక ప్రమాదకరమైనవిగా వర్గీకరణ జరిగింది. ఉష్ణోగ్రతలు పెరిగి హిమానీనదాలు కరగడంతో సరస్సుల వంటి నిర్మాణాల్లో భారీ పరిమాణంలో కరిగిన నీరు పేరుకుపోతుంది. ఒకవేళ భూకంపం సంభవించినా లేదా సరస్సు గట్లలో పగుళ్లు ఏర్పడినా, ఎత్తైన ప్రదేశాల్లో ఉన్న నీరు అపారమైన వేగంతో కిందికి దూసుకువస్తుంది. ఇది ఆ ప్రవాహాన్ని ఉగ్రరూపం దాల్చే వరదగా మార్చి, దాని మార్గంలో ఉన్న ఇళ్లు, హోటళ్లు, రోడ్లు లేదా వంతెనలు వంటి ప్రతిదాన్నీ కొట్టుకుపోతుంది."

# బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై డబ్ల్యూహెచ్ఓ అలర్ట్

బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో జంతువులు, పక్షులలో ఈ వైరస్ కేసులు వేగంగా వ్యాప్తి చెందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. జంతువుల నుంచి మానవులకు బర్డ్‌ఫ్లూ సోకే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. బర్డ్‌ఫ్లూను ఎదుర్కొనేందుకు ఆరోగ్య వ్యవస్థలను ముందస్తుగా సిద్ధం చేయాలని ఆసియా-పసిఫిక్ దేశాలకు సూచించింది. అయితే భారత్‌లో ప్రస్తుతం స్వైన్‌ఫ్లూ (ఎ1బీ1) కేసులు పెరుగుతున్న సమయంలోనే, డబ్ల్యూహెచ్ఓ బర్డ్‌ఫ్లూ అలర్ట్ ఇవ్వడంతో ఈ హెచ్చరికకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఆగస్టు 25- 27 వరకు డబ్ల్యూహెచ్ఓ ఆగ్నేయాసియా, పశ్చిమ పసిఫిక్ ప్రాంతీయ కార్యాలయాలు సంయుక్తంగా బర్డ్‌ఫ్లూ వైరస్ గురించి ఓ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ మీటింగ్‌లో 150 మందికి పైగా ఇన్‌ఫ్లుయోంజా నిపుణులు, సైంటిస్టులు, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు. పక్షులలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి కొనసాగుతుందని ప్రజారోగ్య నిపుణులు పేర్కొన్నారు. జంతువుల నుంచి మానవులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇదే విషయంపై ఈటీవీ భారత్‌లో ఆరోగ్య నిపుణులు, సైంటిస్టులు, వైద్యులు మాట్లాడారు.



**లక్షణాలు ఏంటంటే?**

బర్డ్‌ఫ్లూ సోకిన చాలా మంది రోగులలో జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయని అం టువ్యాధుల నిపుణురాలు, మెడికల్ మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ మనాలి అగర్వాల్ తెలిపారు. ఈ లక్షణాలతో పాటు న్యుమో నియాకు సంబంధించిన లక్షణాలు కూడా కనిపిస్తాయని చెప్పారు. తరచుగా కనిపించే శ్వాసకోశేతర లక్షణాలలో విరేచ నాలు, వాంతులు, కడుపు నొప్పి ఉన్నాయని వివరించారు. ఈ మహమ్మారి నుంచి ప్రజలను కాపాడడానికి సన్నద్ధత చాలా కీలకమన్నారు. "ముందుగా బర్డ్‌ఫ్లూ అంటే ఏమిటో మనం అర్థం చేసుకోవాలి. ఇది ఇన్‌ఫ్లుయోంజా వైరస్ ఉప రకం. ఇది పక్షులు, క్షీరదాలకు సోకుతుంది. అరుదుగా మానవులకు కూడా సంక్రమిస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ సోకిన పక్షులు, ఇతర జంతువులతో సన్నిహితంగా ఉండటం, కలుషితమైన పరిసరాల వల్ల ఆ వ్యాధి మానవులకు సోకే ప్రమాదం ఉంది. మానవుల మధ్య ఈ వైరస్ సోకిన దాఖలాలు ఇప్పటివరకు లేవు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లను తాకడం, అనారోగ్యంతో ఉన్న కోళ్లను తినడం వల్ల మనుషులకు బర్డ్‌ఫ్లూ సోకే అవకాశం ఉంది. పక్షుల నుంచి మానవులకు బర్డ్‌ఫ్లూ శ్వాసకోశ మార్గం, జీర్ణకోశ మార్గం, కంటి పొర ద్వారా వ్యాపిస్తుంది" అని మనాలి అగర్వాల్ పేర్కొన్నారు.

**'డబ్ల్యూహెచ్ఓ సూచనకు అలర్ట్‌గా చూడాలి'**

బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపును పరిస్థితికి ప్రతిస్పందనగా కాకుండా, మరో భిన్నమైన ఇన్‌ఫ్లుయోంజా ముప్పు గురించి ఇచ్చిన హెచ్చరికగా చూడాలని ప్రముఖ ఆరోగ్య నిపుణుడు, ఏషియన్ సొసైటీ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ తమోరిశ్ కోలే అభిప్రాయపడ్డారు. స్వైన్‌ఫ్లూ అనేది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ఒక కాలానుగుణ ఇన్‌ఫ్లుయోంజా వైరస్ అని తెలిపారు. అయితే బర్డ్‌ఫ్లూ మాత్రం వ్యాధి సోకిన పక్షుల నుంచి, లేదంటే కలుషితమైన పరిసరాల నుంచే మానవులకు వ్యాపిస్తుందని పేర్కొన్నారు. దేశంలో పెద్ద ఎత్తున పౌల్ట్రీ రంగం, పెంపుడు కోళ్లు, లైవ్ బర్డ్స్ మార్కెట్లు, వలస పక్షుల మార్గాల ఉన్నాయని చెప్పారు.

## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన వేదికను శుద్ధీకరణ చేసిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగిన ఆ ఘటన నేరమని అన్నారు. ఆ వ్యవహారంపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పలు వ్యాఖ్యలు చేశారు హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8వ తేదీన ఖర్గే కాంగ్రెస్ సభలో ప్రసంగించారు. ఆయన ప్రసంగం అనంతరం ఆగస్టు 10వ తేదీన కొందరు అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఆ ఘటనను ప్రస్తావించిన రాహుల్, శుద్ధీకరణ పేరుతో దళితులను అంటరానివారిగా చూపుతున్నారని విమర్శించారు. శుద్ధీకరణ అనేది అంటరానితనానికి మరో పేరు అంటూ అభిప్రాయపడ్డారు. 'దళితులు తాకకూడని వారు, అపవిత్రులు అన్న భావనను ఇది వ్యక్తం చేస్తోంది. రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. అలాంటి చర్యలు నేరం' అని రాహుల్ అన్నారు.

**'బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారే'**

అయితే ఆ ఘటనలో ఆర్ఎస్ఎస్, బీజేపీకి చెందిన వారే ఉన్నారని, ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ శుద్ధీకరణ కార్యక్రమాన్ని సమర్థించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'బీజేపీ ఉత్తరాఖండ్ అధ్యక్షుడే శుద్ధీకరణను సమర్థిస్తున్నారు. అదే సమయంలో ప్రధాని మోదీ తాను అన్ని కులాలకు చెందిన వ్యక్తినని చెబుతున్నారు. మరి దళిత నాయకుడికి జరిగిన అవమానంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు' అంటూ ప్రశ్నించారు. ఇక ఆగస్టు 13వ తేదీన రాజ్యసభలో ఆ అంశాన్ని మల్లికార్జున ఖర్గే ప్రస్తావించారని రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఘటనకు పాల్పడిన వారిపై అంటరానితన నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఖర్గే డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ అధ్యక్షుడి తరఫున మేం న్యాయం కోరుతున్నాం. ఉత్తరాఖండ్‌లో ఖర్గేకు న్యాయం జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనకు న్యాయం జరిగే చూడాలి' అని రాహుల్ అన్నారు.


**'దళితలను గౌరవించేందుకు బీజేపీ సిద్ధంగా లేదు'**

ఘటనను కేవలం ఒక రాజకీయ వివాదంగా చూడకూడదని, దేశంలో కుల వివక్షకు సంబంధించిన సమస్యగా చూడాలని రాహుల్ కోరారు. దళితలను గౌరవించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధంగా లేవని ఆరోపించారు. దేశంలో దళితులపై వివక్ష ఇంకా కొనసాగుతోందని అన్నారు. రాజ్యాంగం ఇలాంటి వివక్షను నిషేధించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో దళిత పిల్లలను పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, నేలలు ఊడ్చించడం వంటి ఘటనలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు చేశారు. గ్రామాల్లో సామూహిక బావుల నుంచి దళితులకు నీళ్లు తీసుకునేందుకు అనుమతి ఇవ్వని ఘటనలు ఉన్నాయని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు. కొన్ని టీ దుకాణాల్లో దళితుల కోసం ప్రత్యేకంగా పేపర్ లేదా ప్లాస్టిక్ కప్పులు, ఇతరుల కోసం గాజు కప్పులు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. దళిత వరుడు గుర్రంపై ఊరేగింపుగా వెళ్లే సమయంలో దాడులకు గురవుతారనే భయంతో హెల్మెట్ ధరించే పరిస్థితులు కూడా ఉన్నాయని అన్నారు. ఇదే మన దేశ వాస్తవ పరిస్థితి అంటూ వ్యాఖ్యానించారు.

**'రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం'**

దేశంలో ప్రస్తుతం రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతోందని రాహుల్ గాంధీ అన్నారు. ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి నాయకుల ఆలోచనలతో రూపొందిన రాజ్యాంగం ఉందని, మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. 'వేల సంవత్సరాలుగా దళితులపై హింస, వివక్ష కొనసాగింది. రాజ్యాంగం దాన్ని చట్టవిరుద్ధం చేసింది. అయినప్పటికీ నేటికీ ఇలాంటి ఘటనలు కనిపిస్తున్నాయి' అని అన్నారు. అదే విషయాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాజస్థాన్ కాంగ్రెస్ నేత టికారామ్ జూలీ, కేంద్ర మాజీ మంత్రి జితిన్ రామ్? మాంఝీ వంటి దళిత నేతలు వేర్వేరు సందర్భాల్లో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారని రాహుల్ పేర్కొన్నారు. ఒక దళితుడు ఎంత విజయవంతమైతే, అతడిపై దాడులు అంత తీవ్రంగా ఉంటాయని అన్నారు. అయితే హల్ద్వానీ ఘటనపై కాంగ్రెస్ విమర్శలు చేయడాన్ని ఇప్పటికే బీజేపీ ఖండించింది. పార్టీ ఇలాంటి కార్యకలాపాలను సమర్థించదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా గతంలో స్పష్టం చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## ఎల్ఓసీ వద్ద పాక్ డ్రోన్ కలకలం



జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ డ్రోన్ సంచారం కలకలం రేపింది. ఎల్ఓసీ వెంబడి మెంధర్ సెక్టార్‌లోని బాలాకోట్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి డ్రోన్ చక్కర్లు కొట్టడాన్ని భద్రతా దళాలు గుర్తించాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు సరిహద్దు జిల్లాలను జల్లెడపడుతున్నాయి. డ్రోన్ ఏదైనా అనుమానాస్పద వస్తువులను జారవిడిచిందా? లేదా ఏమైనా తీసుకెళ్లిందా? అనే కోణంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం, బాలాకోట్ ప్రాంతంలోని బెహ్రూటి గ్రామం వద్ద రాత్రి 8:05 గంటల ప్రాంతంలో ఓ డ్రోన్ కనిపించింది. కొంతసేపు ఆ ప్రాంతంలో చక్కర్లు కొట్టిన డ్రోన్, అనంతరం సరిహద్దుకు సమీపంలోని మంగళ్‌నార్-డబ్రోట్ వైపు కదిలినట్లు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే తిరిగి పాకిస్థాన్ వైపు వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన బలగాలు నిఘాను మరింత పెంచాయి. తెల్లవారుజామున రంగంలోకి దిగి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. అలాగే సరిహద్దు ప్రాంతంలో భద్రతా దళాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని అధికారుల చెప్పారు. డ్రోన్ కదలికలపై నిఘా కొనసాగుతోందని, అనుమానాస్పదంగా ఏదైనా గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకునేందుకు బలగాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. పూంచ్‌తో పాటు జమ్ము ప్రాంతంలోని మరికొన్ని జిల్లాల్లోనూ భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉధంపూర్, కథువా, రాజౌరి జిల్లాల పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో పోలీసులు, సైన్యం, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా బరిలోకి దిగాయి. శుక్రవారం సాయంత్రం నుంచి ఉధంపూర్-కథువా అటవీ బెల్ట్‌లోని కుబాన్, నగేన్, ఖత్రైల్, గోడు ఫలాల్, పదేతర్, చోర్ మొట్టు, కియా, ఖేబా, భేద్, మార్తా, జోఫర్ తదితర మారుమూల గ్రామాలను జల్లెడపడుతున్నాయి.

**ఇద్దరు సాయుధులు**

ఇదే సమయంలో రాజౌరి జిల్లాలోని గైబాస్, మిథియాని, మోగ్లా, నర్లా ప్రాంతాల్లో ఇద్దరు సాయుధులు సంచరిస్తున్నట్లు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో సైన్యం రంగంలోకి దిగింది. బలగాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దట్టమైన అడవులు, కొండ ప్రాంతాల గుండా గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. అనుమానితులు ఉగ్రవాదులై ఉండొచ్చన్న అనుమానంతో పోలీసులు, సైన్యం, పారామిలిటరీ బలగాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఆ సాయుధుల గురించి ఎటువంటి సమాచారం లభించలేదు. ఈ ఏడాది ప్రారంభంలోనూ పాకిస్థాన్?కు చెందిన డ్రోన్లు జమ్ముకశ్మీర్?లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా భద్రతా దళాలు తిప్పికొట్టాయి. మార్చి 1న జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్‌కు చెందిన డ్రోన్లు భారత గగనతలంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు సరిహద్దుల గుండా చొరబడేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, భారత భద్రతా దళాలు వాటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నాయి. ప్రస్తుతం ఉధంపూర్, కథువా, రాజౌరి, పూంచ్ జిల్లాల్లో కొనసాగుతున్న తనిఖీలతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా కొంతకాలం క్రితం జమ్ముకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారీగా మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ ద్వారా వాటిని జారవిడిచినట్లు అధికారులు అనుమానించారు. ఫిబ్రవరి 13న అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో 6.5 కిలోలకు పైగా హెరాయిన్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పట్టుబడిన మాదక ద్రవ్యాల విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం జరిగిన ఈ ఘటనలో కూడా పాకిస్థాన్ డ్రోన్ 'ఏదైనా అనుమానాస్పద వస్తువు విడిచిందా' అనే విషయంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# మరో నాలుగు లక్షల కొత్త ఇళ్లు మంజూరు



రాష్ట్రంలోని ఇళ్లు లేని గ్రామీణ పేదలకు కూటమి ప్రభుత్వం త్వరలో శుభవార్త అందించనుంది. రాబోయే వారం లేదా పది రోజుల్లో 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎమ్?ఏవై) గ్రామీణ-2.0' పథకం కింద కేంద్రం రాష్ట్రానికి మరో 4 లక్షల కొత్త ఇళ్లను మంజూరు చేసే అవకాశం ఉంది. రాష్ట్ర అధికారులు ఇప్పటికే అర్హులైన లబ్ధిదారుల వివరాలను కేంద్రానికి సమర్పించారు. దీనిపై కేంద్ర గృహనిర్మాణ శాఖ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. పీఎమ్?ఏవై-2.0 కింద రాష్ట్రానికి ఇప్పటికే 77,000 ఇళ్లు మంజూరయ్యాయి. అదనంగా మరో 4 లక్షల ఇళ్లను కేంద్రం మంజూరు చేసిన తర్వాత, మొత్తం కేటాయించిన ఇళ్లను జిల్లాల వారీగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

**రాష్ట్ర ప్రభుత్వ చొరవతో**

'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్)-1.0' పథకం కింద రాష్ట్రానికి సుమారు 19 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 2024కు ముందు మంజూరైన 3.71 లక్షల ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదని కేంద్రం గుర్తించింది. ఇవి కాకుండా, మరో 4 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను కేటాయించడం వల్ల, చాలా మంది ఇళ్లు నిర్మించుకోవడానికి వెనుకాడుతూ వచ్చారు. లక్షలాది ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో, కొత్త ఇళ్లను మంజూరు చేయడానికి ముందు పాత ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు నిర్ధారించే నివేదిక అవసరమని కేంద్రం పట్టుబట్టింది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొత్త ఇళ్ల మంజూరుకు ఈ సమస్య ప్రధాన అడ్డంకిగా మారింది. ఫలితంగా మొదటి దశలో కేవలం 77,000 ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయి. అయితే రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు సుమారు 9 లక్షల మంది ఉన్నందున, కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని వారికి ఇళ్ల కేటాయింపులు సాధించేందుకు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపింది. దీని ఫలితంగా, కేంద్రం తన వద్ద ఉన్న 25 లక్షల ఇళ్ల 'బఫర్ స్టాక్' (అదనపు నిల్వ) నుంచి 4 లక్షల ఇళ్లను విడుదల చేయడానికి అంగీకరించినట్లు సమాచారం.

**లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు:**

"వైఎస్సార్సీపీ ప్రభుత్వం అస్తవ్యస్త స్థితిలో వదిలేసిన గృహనిర్మాణ లేఅవుట్లను నివాసయోగ్యంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధుల అంచనాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించిందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్లలో ఇంకా గృహ నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారుల వివరాలను సేకరించాలని అసిస్టెంట్ ఇంజనీర్లను ఆయన ఆదేశించారు. 'పీఎం -జన్మన్' పథకం కింద ఆదివాసీల కోసం మంజూరైన 43,592 ఇళ్ల నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు, అలాగే ఈ పనిని పర్యవేక్షించేందుకు తొమ్మిది జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు'

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం



**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం. ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు. ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది. జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కళ్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొరేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మొత్తం పదహారు కార్పొరేషన్లలలో ఐదు అంటే ఎక్కువేనని టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ కార్పొరేషన్ ను వదులుకునేందుకు టీడీపీ సిద్ధంగా ఉండదు. అలాగే ఏలూరు కార్పొరేషన్ విషయంలోనూ టీడీపీ పట్టుబట్టే అవకాశముంది. ఇక తిరుపతి విషయంలో గత శాసనసభ ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం కేటాయించాం కాబట్టి ఈ సారి మేయర్ స్థానం తమకు ఇవ్వాలని జనసేన ముందు టీడీపీ కొంత ప్రతిపాదన పెట్టే అవకాశముంది. ఇక కాకినాడ కార్పొరేషన్ లో ఎటువంటి ఇబ్బందులు లేవు. అలాగే ఒంగోలు కార్పొరేషన్ ను కూడా టీడీపీ వదులుకునేందుకు సిద్ధపడకపోవచ్చు. అక్కడ పట్టు పోకుండా ఉండాలంటే కార్పొరేషన్ తమ గ్రిప్ లో ఉంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పట్టుబట్టవచ్చు. ఇవి కాకుండా మిగిలిన చోటా చోటా కార్పొరేషన్లకు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధపడవచ్చు. ఐదు కార్పొరేషన్లకు మూడు కార్పొరేషన్లు జనసేనకు కేటాయించే అవకాశాలున్నాయి. ఉత్తరాంధ్రలోనూ, రాయలసీమలోనూ కొన్ని చోట్ల కేటాయించే ఛాన్స్ ఉంది. అంతే తప్ప తమకు బలం ఉన్న స్థానాలను పొత్తులో భాగంగా వదులుకోకూడదన్న అభిప్రాయం కూడా టీడీపీ నేతల్లో ఉంది. ఐదు కార్పొరేషన్లు అడిగితే మూడు ఇస్తారన్నది జనసేన వ్యూహం కావచ్చు. అదే జరిగితే జనసేన కోరినవి కాకుండా దాని బలం అంచనా వేసి కాకినాడతో పాటు మరొక రెండు కార్పొరేషన్లు కోరే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద జనసేన మాత్రం కొంత స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగానే స్థానాలను కోరాలని భావిస్తుంది. జనసేనఐదు కార్పొరేషన్లను తీసుకోగలిగితే 31.25 శాతం షేరింగ్ అవుతుంది. మరొకవైపు పవన్ కళ్యాణ్ పై జనసైనికుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో జనసేన ఏ రకంగా సీట్ల షేర్ సాధిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

# అనిల్ లో నిర్వేదం..



**నెల్లూరు :** పదవి ఉన్నా లేకపోయినా తనకో చరిత్ర ఉందని వైసీపీ ఆఫీసులో కూర్చుని పోసుకోలు కబుర్లు చెప్పిన అనిల్ కుమార్ మాటల నిర్వేదం వెనుక అసలు రహస్యం.. స్థానిక ఎన్నికల విషయంలో ఆయనకు నెల్లూరు సిటీలో అసలు బాధ్యతలే ఇవ్వకపోవడం. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే తాను పోటీ చేయనంటూ ఆయన చేసిన ప్రకటనలు.. సొంతంగా బాధ్యత తీసుకోవడానికి చేసిన ప్రయత్నం అని వైసీపీ వర్గాలంటున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమన్వయ బాధ్యతలను పార్టీ అధిష్టానం ఆయనకు అప్పగించలేదు. ఆయన ఇంచార్జ్ కూడా కాదు. తాను ఏదో బాధ్యత తీసుకుంటున్నట్లు ఫోజు కొడుతూ చేసిన ప్రకటనలు కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే. గత సార్వత్రిక ఎన్నికల నుంచి అనిల్ కుమార్ యాదవ్ రాజకీయ పరిస్థితి తలకిందులైంది. నెల్లూరు సిటీ నుంచి ఆయనను తప్పించి నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించగా, అక్కడ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆయన అటువైపు వెళ్లడం పూర్తిగా మానేశారు. తిరిగి తన సొంత ఇలాకా అయిన నెల్లూరులో పట్టు నిలుపుకుందామంటే, అక్కడ స్థానిక వైసీపీలో రెడ్డి నేతలు ఆయనను కనీసం కాలుమోపనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో చేతిలో అసెంబ్లీ నియోజకవర్గం లేక, ఎంపీగా ఓడిపోయిన ప్రాంతానికి వెళ్లలేక అనిల్ తీవ్ర రాజకీయ శూన్యతను ఎదుర్కొంటున్నారు. మరోవైపు, నెల్లూరు సిటీ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే దూకుడు పెంచారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్‌ను లక్ష్యంగా చేసుకున్న పర్వతరెడ్డి, తాజాగా స్థానిక సమరానికి సంబంధించి నెల్లూరు సిటీ బాధ్యతలన్నింటినీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకే అప్పగించారంటూ బహిరంగంగా ట్వీట్ చేయడం అనిల్ వర్గానికి పెద్ద షాక్‌గా మారింది. కార్పొరేషన్ వ్యవహారాల్లో చక్రం తిప్పుదామనుకున్న అనిల్ ఆశలపై ఈ పరిణామం నీళ్లు చల్లినట్లయింది. పార్టీ పెద్దల నుంచి వచ్చిన ఈ స్పష్టమైన సంకేతంతో నెల్లూరు సిటీలో అనిల్‌కు రాజకీయంగా ద్వారాలు మూసుకుపోయినట్లేనని స్పష్టమవుతోంది. ఎలాగైనా తిరిగి నెల్లూరు సిటీ రాజకీయాల్లోకి రావాలని చూస్తున్న అనిల్ ప్రయత్నాలన్నీ వరుసగా బెడిసికొడుతున్నాయి. ఒకప్పుడు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో మంత్రిగా చక్రం తిప్పి, ప్రత్యర్థులపై విరుచుకుపడిన ఆయన, నేడు సొంత పార్టీలోనే ఏ బాధ్యతా లేని స్థితికి దిగజారడం గమనార్హం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సరైన నియోజకవర్గం లేక, నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతలను సైతం ప్రత్యర్థి వర్గం దక్కించుకోవడంతో అనిల్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా అగమ్యగోచరంగా మారింది.

## గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు

-మొదటిపేజీ తరువాయి

వచ్చేదన్నారు. ఇప్పుడు మీ ఆరోగ్యం మీ ఫోన్‌లో ఉందని, ఎక్కడికి వెళ్లినా మీ ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్?ను క్రోడీకరించి ఆరోగ్యాన్ని రక్షిస్తామన్నారు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించామన్నారు. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్ టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతామన్నారు. 3 నెలల్లో అల్లూరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. "ఏ వైద్య పరీక్ష అయినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిపేలా ఏర్పాట్లు చేస్తాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తున్నాం. దీంతో నేను సంతృప్తి చెందడం లేదు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కాలనేది ఈ ప్రభుత్వ విధానం. అందరికీ ఆమోదయోగ్యమైన జీవోను మళ్లీ తీసుకువస్తామని హామీ ఇస్తున్నా. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చాం. ఏజెన్సీ ప్రజలకు ఆదాయం అరకు కాఫీ, మిరియాల నుంచి వస్తోంది" అని సీఎం తెలిపారు.

**పారదర్శకంగా 16 వేలమందికి పోస్టులిచ్చాం**

ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా డీఎస్సీ నిర్వహించామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పారదర్శకంగా 16 వేలమందికి టీచర్ పోస్టులిస్తే ఏడాది తర్వాత గొడ్డలి పార్టీ రాద్ధాంతం చేస్తోందని ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ హయాంలో ఏపీపీఎస్సీలో అక్రమాలకు పాల్పడి, నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు గన్నెల పంచాయతీ ఆర్.కె.నగర్‌లో ప్రజలతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణీతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 మంది జనాభా ఉండగా, ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని, అందుకు గల విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళ తన కుమార్తె నీట్ శిక్షణలో ఉందని తెలుపగా శెభాష్ అన్న ముఖ్యమంత్రి. అందరూ ఇదే స్ఫూర్తితో పిల్లలని చదివించాలన్నారు. మహిళలతో మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు? ఏం చేయబోతున్నారు? అని ప్రశ్నించారు. ఆర్.కె.(రామకృష్ణ) నగర్ లో మొత్తం 16 మందితో సీఎం మాట్లాడారు. వారందరీ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు మీ వరకు చేరుతున్నాయా అని ఆరా తీశారు. చంద్రబాబు రాకను పురస్కరించుకొని ఆర్.కె.నగర్ మహిళలు, చిన్నారులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు.

## ఎంబీబీఎస్, బీడీఎస్ ఫీజులు 10 శాతం పెంపు

-మొదటిపేజీ తరువాయి

కోటా ఏ-కేటగిరికి రూ. 18,150, బీ-కేటగిరికి (మేనేజ్‌మెంట్ కోటా) రూ.14.52లక్షలు, సీ-కేటగిరి(ఎన్నారై కోటా) రూ.43.56 లక్షల ఫీజులను నిర్ణయించారు. బీడీఎస్ కన్వీనర్ కోటా ఏ-కేటగిరికి రూ.15,730, బీ-కేటగిరికి రూ.4.84లక్షలు, సీ-కేటగిరికి రూ. 14.52 లక్షలుగా నిర్ణయించారు.

**మెడికల్ పీజీ కోర్సులకు**

మెడికల్ పీజీ కోర్సులకు క్లినికల్ డిగ్రీ ఏ-కేటగిరికి రూ.5,71,320, బీ-కేటగిరికి రూ.11,42,640, సీ-కేటగిరికి రూ.66,12,500 పారాక్లినికల్ డిగ్రీ, డిప్లమా ఏ-కేటగిరికి రూ.1,78,538, బీ-కేటగిరికి రూ.3,57,075, సీ-కేటగిరికి రూ.19,83,750 ప్రీ క్లినికల్ డిగ్రీ ఏ-కేటగిరికి రూ.80,937, బీ-కేటగిరికి రూ. 1,61,874, సీ-కేటగిరికి రూ.10,58,000గా నిర్ణయించారు. డెంటల్ క్లినికల్ పీజీ డిగ్రీ ఏ-కేటగిరికి రూ. 3,92,783, బీ-కేటగిరికి రూ.7,85,565, సీ-కేటగిరికి రూ.15,87,000 కాగా, పారా క్లినికల్ డెంటల్ పీజీ ఎ-కేటగిరికి రూ.3,53,504, బీ-కేటగిరికి రూ.5,74,759, సీ-కేటగిరికి రూ.9,25,750 నిర్ణయించారు. సూపర్ స్పెషాలిటీ కోర్సులకు జీఎస్ఎల్, కస్తూరి, నారాయణ, ఎన్నారై, డాక్టర్ సిద్ధార్థ మెడికల్ కళాశాలల్లో రూ. 19,83,750 ఫీజు ఉంటుందని ఉత్తర్వులలో తెలిపారు. ఈమేరకు మూడు వేర్వేరు జీవోలను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి వీరపాండ్యన్ విడుదల చేశారు.

**కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్**

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కోర్సులో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్ల నమోదుకు షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇవాళ ప్రకటించిన తుది మెరిట్ జాబితాలో పేరున్న అభ్యర్థులందరూ వెబ్?ఆప్షన్లు ఇవ్వడానికి అర్హులని వెల్లడించింది.

## ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొనేలా

-మొదటిపేజీ తరువాయి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.92 లక్షల ప్రైజ్ మనీ అందజేశారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో పతకాలు సాధించిన 264 మంది క్రీడాకారులకు రూ.8.80 కోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఓర్పు, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. ఆటలతో భవిష్యత్తు ఉండదనే అపోహను వీడాలని, క్రీడలను చదువుతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో మరింత ప్రాధాన్యం కల్పించేలా క్రీడా కోటా పెంపుపై అసెంబ్లీలో తీర్మానం తీసుకొస్తామని ప్రకటించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అమరావతిలో 500 ఎకరాల్లో అత్యాధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోందని, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలోనూ భారీ క్రీడా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచ స్థాయి పోటీల్లోనూ ఆంధ్రప్రదేశ్ నుంచి క్రీడాకారులు పాల్గొనేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దేందుకు శాప్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పాఠశాలల్లో క్రీడా మైదానాలు, వాకింగ్ ట్రాక్‌లు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆసియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు**

మరోవైపు అమరావతి ఛాంపియన్‌షిప్‌కు ఆసియా బుక్ ఆఫ్ రికార్డు దక్కింది. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి హరీష్ చేతుల మీదుగా క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ఛాంపియన్‌షిప్‌లో 26 జిల్లాల నుంచి అండర్-17, అండర్-23 విభాగాలకు చెందిన 9 వేలకుపైగా బాలబాలికల క్రీడాకారులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.

## తగ్గేదెలా... అంటున్న కడప రెడ్డమ్మ

**కడప :** కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. కడపలో తనకు వైసీపీ పోటీయే కాదని ఆమె చేసిన వ్యాఖ్యలు అతివిశ్వాసమా? మరేదైనా కారణమా? అన్న చర్చ జరుగుతుంది. ఒక యూట్యూబ్ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కడప నియోజకవర్గంలో తనకు వైసీపీ పోటీయే కాదని, తనను ఓడించే సత్తా ఆ పార్టీకి లేదని చెప్పడాన్ని పలువురు అతి విశ్వాసంగానే చూస్తున్నారు. ఎందుకంటే మహామహులే ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. జాతకాలు తిరగబడ్డాయి. అందులో తొలిసారి ఎన్నికయిన మాధవిరెడ్డి ఎంత? అని సోషల్ మీడియాలో కామెంట్స్ వినపడుతున్నాయి. వైసీపీ తనకు పోటీ యే కాదని చెప్పడం గర్వం తలకెక్కిందనడానికి కారణమని, అంతగా రెచ్చిపోతే ప్రజలే బుద్ధి చెబుతారని వైసీపీ సోషల్ మీడియాలో హెచ్చరిస్తున్నారు. అయితే కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి దూకుడుగా మరియు ఆత్మవిశ్వాసంతోఉండటానికి ప్రధానంగా రాజకీయ నేపథ్యం, చారిత్రక విజయం మరియు కుటుంబ నేపథ్యం కారణాలుగా ఉన్నాయి. రెండు దశాబ్దాల తర్వాత కడప అసెంబ్లీ సెగ్మెంట్‌లో తెలుగుదేశం పార్టీ తరఫున గెలిచిన మొదటి మహిళా ఎమ్మెల్యే ఆమె. ఆమె మామ రెడ్డెప్పగారి రాజగోపాల్ రెడ్డి ఐదు సార్లు మంత్రిగా పనిచేసిన ప్రభావశీలమైన రాజకీయ కుటుంబం నుండి రావడంతో పాటు కుటుంబ వ్యాపారాల ద్వారా కన్‌స్ట్రక్షన్ రంగంలో అనుభవం కలిగి ఉండటం, నాయకత్వ లక్షణాలు ఉండటం. కూటమి ప్రభుత్వంలో కడప అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టడం, పవర్‌ఫుల్ స్పీచ్‌లు ఇస్తూ దూకుడు ప్రదర్శించడం వంటివి తనకు అనుకూలమని మాధవి రెడ్డి భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మాధవి రెడ్డి అనేక వివాదాల్లో చిక్కుకున్నారు.

# పాయకరావుపేట చైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు


**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,ఆగస్టు 29 :** పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో శనివారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలుగు భాష గొప్పతనంతో పాటు క్రీడల ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు ప్రభుత్వ ఉపాధ్యాయులు, డిసిఇబి మెటీరియల్ రైటర్, రిసోర్స్ పర్సన్ కొట్ని సత్యబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం ప్రాముఖ్యతను, తెలుగు భాషాభివృద్ధికి గిడుగు వెంకట రామమూర్తి చేసిన విశేష కృషిని విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా గిడుగు రామమూర్తి ప్రజలకు సులభంగా అర్థమయ్యే వ్యావహారిక భాషను ప్రోత్సహించిన విధానాన్ని, తెలుగు భాష పట్ల ప్రతి ఒక్కరూ గర్వం కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రీడల వల్ల కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలను వివరించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని



సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎంవి సురేష్, రీజినల్ ఇంచార్జి గోపీనాథ్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామరాజు, డీన్ మనీష్, ఇంచార్జిలు శ్రీనివాసు, కల్పన, గౌరీ, త్రిమూర్తులు, ఏఓ విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ... విద్యార్థుల్లో భాష పట్ల అభిమానం, సంస్కృతి పట్ల గౌరవం, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహభరితంగా పాల్గొనడంతో విజయవంతంగా ముగిసింది.

# ఆది గణపతి క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతాం-ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**అయినవిల్లి, ఆగస్టు 29(మీ వార్త విలేఖరి)** శ్రీ సిద్ధి వినాయక స్వామివారి నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామివారి క్షేత్రం రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలలో ఒకటని అన్నారు. స్వయంభువుగా వెలసిన ఆది గణపతిగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రానికి ఎంతో విశిష్టమైన చరిత్ర, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందన్నారు. దేశం నలుమూలల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి వస్తున్న నేపథ్యంలో ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన విళ్ల సూర్యనారాయణ (సూరయ్య కాపు) నూతన పాలకవర్గ సభ్యులందరికీ ఎమ్మెల్యే హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పాలకవర్గం సమష్టిగా పనిచేసి భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆలయ అభివృద్ధితో పాటు క్షేత్ర పవిత్రతను కాపాడాలని సూచించారు. వినాయక సదన్ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.22 లక్షలతో సీసీ రోడ్డు, రూ.55 లక్షలతో ఏసీ వసతి గదులు, ఉచిత వసతి హాలులో ఏసీ




సౌకర్యం, రూ.56 లక్షలతో ప్రాంగణం చుట్టూ కాంక్రీట్ చప్టా, రూ.23 లక్షలతో రంగుల పనులు, రూ.28 లక్షలతో సీసీ డ్రెయిన్ విత్ కవర్ స్లాబ్ వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి మండల అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు ,డైరెక్టర్లు, నీటి సంఘం అధ్యక్షులు నెంబర్లు, కూటమి గ్రామ శాఖలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు

# ఇనుకుదురు పేటలో ఘనంగా రుద్రార్చన -- సిందూరార్చన

దైవభక్తితో పాటు దేశభక్తిని పెంపొందించాలి.

**మచిలీపట్నం ఆగస్టు 29(మీ వార్త ప్రతినిధి)** ఇనుకుదురు పేట, ఆగస్టు 29: విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా వారి సహకారంతో ఇనుకుదురు పేట చింతచెట్టు సమీపంలోని శివలింగం మఠంలో శనివారం రాత్రి 7.30 గంటలకు రుద్రార్చన -- సిందూరార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో శ్రీ కూనపురెడ్డి శ్రీనివాసరావు, శ్రీ ఘంటసాల సురేష్, శ్రీ దూళిపాల రాము, శ్రీ హరికృష్ణ, శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీ వర్రె రాజశేఖర్, అలాగే శ్రీమతి రాధా, శ్రీమతి ఐ.వి. సుధ, శ్రీమతి వేముల కృపారాధ, శ్రీమతి విజయలక్ష్మి, శ్రీమతి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో 35 మంది మహిళా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహికంగా నిర్వహించిన రుద్రార్చన, సిందూరార్చనతో శివలింగం మఠం ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.

**దైవభక్తి -- దేశభక్తి పరస్పరం విడదీయరాని విలువలు**

ఈ కార్యక్రమానికి వి హెచ్ పి కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బురగడ్డ శ్రీనాథ్ , తన సందేశాన్ని కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అందించారు.
తన సందేశంలో డా. శ్రీనాథ్ మాట్లాడుతూ, దైవభక్తి మనలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తే, దేశభక్తి మనలో దేశం పట్ల బాధ్యత, సేవాభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు.
"భారతీయ జీవన విధానంలో దైవభక్తి, దేశభక్తి రెండూ పరస్పరం విడదీయరాని విలువలు. భగవంతుడి పట్ల భక్తి మనలో ధర్మబద్ధమైన జీవనాన్ని పెంపొందిస్తే, భారతమాత పట్ల గౌరవం దేశం కోసం పనిచేయాలనే బాధ్యతను కలిగిస్తుంది" అని ఆయన సందేశంలో పేర్కొన్నారు.

**ఆలయాలు ధార్మిక చైతన్యానికి కేంద్రాలుగా నిలవాలి**

ఆలయాలు కేవలం పూజా స్థలాలుగా మాత్రమే కాకుండా ధార్మిక చైతన్యం, సామాజిక ఐక్యత, సేవాభావం మరియు దేశభక్తిని పెంపొందించే కేంద్రాలుగా నిలవాలని డా. శ్రీనాథ్ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరిలో భక్తితో పాటు భారతమాత పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత, దేశం పట్ల సేవాభావం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా




యువతలో దైవభక్తితో పాటు దేశభక్తి భావనను బలపరచాలని పిలుపునిచ్చారు.

**"వందేమాతరం" -- భారతమాత పట్ల గౌరవానికి ప్రతీక**

"వందేమాతరం" భారతమాత పట్ల గౌరవానికి, దేశభక్తికి ప్రతీక అని డా. శ్రీనాథ్ తన సందేశంలో పేర్కొన్నారు. ధార్మిక కార్యక్రమాల సందర్భంగా భక్తితో పాటు సామూహికంగా వందేమాతరం ఆలపించే సంప్రదాయాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.
"దైవభక్తి మనకు ధర్మాన్ని నేర్పుతుంది; దేశభక్తి మనకు బాధ్యతను గుర్తుచేస్తుంది. ఈ రెండూ కలిసినప్పుడే బలమైన, ఐక్యమైన, సేవాభావం కలిగిన సమాజాన్ని నిర్మించగలం" అని ఆయన అన్నారు.నిర్వాహకులకు అభినందనలుకార్యక్రమంలో పాల్గొన్న 35 మంది మహిళా భక్తులకు, కార్యక్రమ నిర్వహణకు సహకరించిన నిర్వాహకులు, కార్యకర్తలు, ఆలయ ప్రతినిధులు మరియు స్థానిక పెద్దలకు వి హెచ్ పి కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బురగడ్డ శ్రీనాథ్, జిల్లా ప్రభారి శ్రీ పి వి ఎస్ నాయుడు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.
భక్తుల సహకారం, నిర్వాహకుల సమన్వయం, కార్యకర్తల కృషితో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని వారు పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా సనాతన ధార్మిక సంప్రదాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు దైవభక్తి, దేశభక్తి, సేవాభావం మరియు సామాజిక ఐక్యతను పెంపొందించే మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని వి హెచ్ పి నాయకులు తెలిపారు.
"దైవభక్తి నుంచి దేశభక్తి... దేశభక్తి నుంచి సమాజసేవ" అనే స్ఫూర్తితో కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు వెల్లడించారు.కావాలంటే దీన్ని ఇప్పుడు ఈనాడు/ఆంధ్రజ్యోతి తరహా కుదించిన 5--6 పేరాల పత్రికా వార్తగా కూడా తయారు చేయవచ్చు.

## విద్యా ప్రమాణాలు పెంపొందించాలి : ఎంఈఓ-1 ఎం. శ్రీనివాస్



**పెంటపాడు ఆగస్టు 29 (మీ వార్త ప్రతినిధి)** స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు విద్యా ప్రమాణాలు పెంపొందించే విద్యానిధి కేంద్రాలుగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి-1 ఎం. శ్రీనివాస్ అన్నారు.రెండో విడత స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలులో భాగంగా నాలుగో శనివారం జడ్పీహెచ్ఎస్ అలంపురం మరియు పోస్ట్ బేసిక్ పాఠశాల పెంటపాడు నందు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు.ఈ సమావేశానికి డైట్ లెక్చరర్ వి. స్వరాజ్ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు పెంపొందించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న అన్ని విషయాల్లో నిబద్ధతతో పని చేయాలని సూచించారు. పాఠశాల విద్య బలోపేతం కావాలంటే అది తరగతి నాలుగు గోడల మధ్యనే ఉంటుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును మహోన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దాట్ల పద్మజ, సీఆర్పీలు, కాంప్లెక్స్ కార్యదర్శులు శివకుమార్, రమేష్ పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నేత పెనుమాక గాంధీకి పలువురి నివాళులు

**పెంటపాడు ఆగస్టు 30 (మీ వార్త ప్రతినిధి)** ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు పెనుమాక గాంధీ శు క్రవారం మధ్యాహ్నం మృతి చెందారు.ఆయన మృతి ప్రత్తిపాడు గ్రామానికే కాకుండా దళిత జాతికి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు.గాంధీ పార్థివదేహానికి దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు తదితరులు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గాంధీ



ఎమ్మార్పీఎస్ ఉద్యమంతో పాటు గ్రామంలో అనేక సమస్యలపై,సామాజిక వివక్షపై నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు.దళిత సామజిక వర్గం ప్రజలకు న్యాయం చేసేందుకు గాంధీ ఎనలేని కృషి చేశారన్నారు.ఆయనకు నివాళులర్పించిన వారిలో జనసేన పార్టీ పెంటపాడు మండలం ప్రధాన కార్యదర్శి చెరుకూరి జగత్ సోమశేఖర్ (పండు), టీడీపీ నాయకులు వీర్ల కృష్ణ, ముప్పిడి రమేష్,వైసీపీ నాయకులు వీర్ల గోవింద్, చెప్పుల వాసు,పెనుమాక సుదర్శన్, ఆరుగొల్లు సందీప్,పెనుమాక మనోహర్, పెనుమాక అనిల్,పిన్నాక రవి ప్రకాష్, ఎనిమెళ్ల శ్రీనివాస్,జాలాది ప్రసాద్, పెనమాక ప్రసాద్,ఆరుగొల్లు సతీష్, ఆరుగొల్లు అజయ్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పాయకరావుపేట భాష్యం పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ,,



**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,ఆగస్టు 29 :** పట్టణంలోని రాజుగారి బీడులోని భాష్యం పాఠశాలలో శనివారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా వైభవాన్ని, గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో పలు సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కుమార్, హెచ్ఎం శ్రీలక్ష్మి తెలుగు భాష యొక్క ప్రాముఖ్యత, చరిత్ర, గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష అభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు సేవలను స్మరించుకున్నారు. వ్యవహారిక భాష ఉద్యమం ద్వారా తెలుగు భాషను ప్రజలకు మరింత చేరువ చేసిన గిడుగు రామమూర్తి కృషిని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తెలుగు పద్యాలు, గేయాలు, సామెతలు, తెలుగు భాషకు సంబంధించిన వివిధ అంశాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈస్ట్-1 జోనల్ ఇంచార్జి వి గోవిందరాజు, ఈస్ట్-4 జోనల్ ఇంచార్జి పి వేణు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబానికి కష్టం వస్తే.. తెలుగుదేశం పార్టీ అండ

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

**పెడన ఆగస్టు 29(మీ వార్త ప్రతినిధి)** టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుంది. కేవలం రూ.100 సభ్యత్వ రుసుముతో రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నాం.ఇటీవల రోడ్డు ప్రమాదంలో బంటుమిల్లి మండలం కోర్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ



కార్యకర్తలు బోడవుల నాగేంద్రబాబు గారు, నీలపాల వెంకన్న గారు మృతి చెందారు. వారు టీడీపీ సభ్యత్వం కలిగి ఉండటంతో, వారి కుటుంబాలకు రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేశాము.కష్టకాలంలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, మంత్రి శ్రీ నారా లోకేష్ గారికి నాగేంద్రబాబు గారు, నీలపాల వెంకన్న గారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యకర్తల సంక్షేమం పట్ల నారా లోకేష్ గారు చూపిస్తున్న శ్రద్ధకు ఈ ప్రమాద బీమా పథకం నిదర్శనం. కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచే ఇలాంటి నాయకత్వంలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉంది.

## యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వం లక్ష్యం

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం ఆగస్టు 29 (మీ వార్త ప్రతినిధి)** యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అని, ఆ లక్ష్యాలను చేరేందుకే నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా ఉద్యోగం మేళా నిర్వహించినట్లు ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని డా. గోయింకా ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్మెంట్) ఉద్యోగ మేళాకు తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యమే విజయానికి పునాది అన్నారు. ప్రతి విద్యార్థి,ప్రతి పట్టభద్రుడు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ ఉద్యోగ మేళాలో పాల్గొన్న వివిధ సంస్థల ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు ధైర్యంగా వారి ప్రతిభను ప్రదర్శించాలన్నారు. ప్రతి ఇంటర్వ్యూ ఒక కొత్త అవకాశం, ప్రతి అవకాశం మీ భవిష్యత్తును మార్చే శక్తి కలిగి ఉంటుందన్నారు.ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం మీ ముందే మోకరిల్లుతుందన్నారు.
యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో వారిని తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యం. ఈ ఉద్యోగ మేళా ద్వారా వందలాది మంది యువత తమ కెరీర్‌కు తొలి అడుగు వేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏపీ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి,యువత,విద్యార్థులు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 7 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు విడుదల చేస్తారు



**తణుకు : ఆగస్టు 29 మీ వార్తా జిల్లా ప్రతినిధి.**రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు రావాల్సిన సుమారు 7 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఆజాదీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి వంశీ డిమాండ్ చేశారు. శనివారం తణుకులో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ఉన్నారని, బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న నిధులను ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందో స్పష్టమైన తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఫీజులు చెల్లించకపోవడం వల్ల విద్యార్థుల చదువులకు ఇబ్బందులు ఏర్పడితే అందుకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలపై ప్రభుత్వం తక్షణమే సమీక్షా సమావేశం నిర్వహించి, బకాయిలను విడుదల చేసే కార్యాచరణను ప్రకటించాలని కోరారు.ఇక మాటలు కాదు.. నిధులు విడుదల చేయాలి అని నల్లమిల్లి వంశీ స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి ప్రజాస్వామ్య పద్ధతిలో మరింత తీవ్రస్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.


## భాషా, క్రీడా దినోత్సవాలు ఆదర్శంగా నిర్వహించాలి

ఎంఈఓ-2 డా. టీవీ రామకృష్ణ



**పెంటపాడు, ఆగస్టు 29 (మీ వార్త ప్రతినిధి)** తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఆదర్శంగా నిర్వహించాలని ఎంఈఓ డాక్టర్ టీవీ రామకృష్ణ పిలుపునిచ్చారు.పెంటపాడు ప్రభుత్వ పోస్ట్ బేసిక్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఆగస్టు 29న జరిగే తెలుగు భాషా దినోత్సవ ఆద్యులు గిడుగు వెంకట రామ్మూర్తి తెలుగు భాషకు ఎనలేని కృషి చేశారని, ఆయన్ని ఆదర్శంగా తీసుకుని తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఇంగ్లీష్ వ్యామోహం వీడి కుటుంబంలోనే తెలుగు మాట్లాడాలని, రాబోయే తరాలకు తెలుగు ఔన్నత్యాన్ని తెలియజేయాలన్నారు.మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఆయన్ని ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు డి. పద్మజ,తెలుగు ఉపాధ్యాయుడు ప్రసాద్,వ్యాయామ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## అయినవిల్లి ఆది గణపతి క్షేత్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అమలాపురం,మీ వార్త ప్రతినిధి,ఆగస్టు,29** అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామివారి క్షేత్రాన్ని ఆదర్శ ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. వినాయక సదన్‌లో నిర్వహించిన నూతన ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నూతన చైర్మన్ విళ్ల సూర్యనారాయణ (సూరయ్య కాపు), పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా వినాయక సదన్‌లో సీసీ రోడ్డు, ఏసీ వసతి గదులు, డ్రెయిన్లు, కాంక్రీట్ పనులు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. భక్తుల ప్రధాన సమస్య అయిన పార్కింగ్ పరిష్కారానికి కృషి చేస్తున్నామని, భవిష్యత్‌లో బైపాస్ రోడ్డు, కాలువ గట్టు రహదారి అభివృద్ధి, ఆలయాల పునరుద్ధరణ, నూతన అన్నప్రసాద భవనం వంటి పనులు చేపడతామని తెలిపారు. భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో ముందుకు సాగుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి 3 పార్టీల నేతలు పాల్గొన్నారు.

## నక్కపల్లి లో ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలు



**నక్కపల్లి : ఆగస్టు 29 ( మీ వార్త ప్రతినిధి )** హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని స్థానిక నక్కపల్లి హాకీ క్రీడాకారులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు చౌదరి మాస్టర్, బి ఎస్ హాకీ క్లబ్ అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి తాతాజీ మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ లెజండ్ రీ హాకీ క్రీడాకారుడైనా ధ్యాన్ చంద్ జన్మదినాన్ని జాతీయ క్రీడా దినోత్సవం గా జరుపుకోవడం సంతోషమని ప్రతి ఒక్క క్రీడాకారులు ధ్యాన్ చంద్ ను స్ఫూర్తి గా తీసుకోని భవిష్యత్తు లో క్రీడాకారులు బంగారు బాటలు వేసుకోవాలని భారత దేశం గర్వించే విదంగా క్రీడాకారులు తయారు అవ్వాలని కోరారు. నక్కపల్లి లో బి ఎస్ హాకీ క్లబ్ స్థాపించి క్రీడాకారులు కు నూతన ఉత్తేజం తీసుకోని వచ్చారని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ నుండి సహాయ సహకారాలు తో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్తు లో ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## సెప్టెంబర్ 3న వైఎస్ఆర్సిపి మండల సమావేశం

వైసిపి మండల అధ్యక్షుడు కైకాల శ్రీనివాస్



**పెంటపాడు ఆగస్టు 29 (మీ వార్త ప్రతినిధి)** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెంటపాడు మండలం సమావేశం సెప్టెంబర్ 3న నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు కైకాల శ్రీనివాస్ అన్నారు.శనివారం వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,పెంటపాడు-2 ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సూరిబాబు నివాసం వద్ద వైసిపి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పార్టీ మండల అధ్యక్షుడు కైకాల శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 3న పెంటపాడు కొటక్ మహీంద్రా బ్యాంక్ ఎదురుగా గల శిరిగినీడి విజయ్ కృష్ణ కాంప్లెక్స్ నందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జ్ వడ్డీ రఘురాం నాయుడు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు కైకాల శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామం నుండి వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఇంచార్జ్ వడ్డీ రఘురాం నాయుడు ఈ సమావేశంలో దిశా నిర్దేశం చేయనున్నట్లు ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సూరిబాబు,నల్లమిల్లి అంజిరెడ్డి,బర్ల జయరాం బాబు, కొవ్వూరి ప్రసాద్ రెడ్డి,నల్లమిల్లి అప్పిరెడ్డి,చిర్ల వెంకటరెడ్డి,కర్రి పృథ్వీ రెడ్డి,మారంపూడి ఏసు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లి రమావతికి రాష్ట్ర ప్రభుత్వ తెలుగు భాషా పురస్కారం



**తాడేపల్లిగూడెం ఆగస్టు 29 (మీ వార్త ప్రతినిధి)** తెలుగు భాషా దినోత్సవం (గిడుగు రామ్మూర్తి జయంతి) సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక భాషా పురస్కారాన్ని విశ్వసాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు కొల్లి రమావతి అందుకున్నారు.రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు పలువురు భాషావేత్తలు, సాహితీమూర్తుల సమక్షంలో ఈ అవార్డుల ప్రదాన కార్యక్రమం శనివారం సాయంత్రం విజయవాడలోని అంబేద్కర్ హాల్ లో ఘనంగా జరిగింది.రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా రమావతి అవార్డును స్వీకరించారు.ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ ఎస్.ఎస్. రావత్, అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల త్రివిక్రమ్, పొడపాటి తేజస్విని, విల్సన్ శరత్ చంద్ర సహా అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు. ఎంతో వైభవంగా సాగిన ఈ కార్యక్రమం వందలాది ప్రేక్షకులను ఆకట్టుకుంది.కొల్లి రమావతి తాడేపల్లిగూడెంలో రెండుసార్లు కౌన్సిలర్ గా పనిచేశారు. ప్రస్తుతం విశ్వసాహితీ కళావేదిక సాహిత్య సంస్థ చైర్ పర్సన్ గా కొనసాగుతున్నారు.

## కేశవరెడ్డి మృతి తీరని లోటు..

**తల్లాడ మీ వార్త ప్రతినిధి.29.8.2026**

టీపీసీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు..



గ్రామస్తుల అందరితో ఆప్యాయంగా ఉండే మృదు స్వభావి కేశవరెడ్డి లేని లోటు తీర్చలేనిదని టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన నారపోగు వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. కేశవరెడ్డి మృత్యువాత తెలుసుకున్న ఆయన తన సంతాపాన్ని ప్రకటించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు గుర్తుచేసుకున్నారు. ఆయన అకాల మృతి వ్యక్తిగతంగా తనకు తీరని లోటు అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఉన్నా సమయంలో ఆయనతో కలిసి పనిచేసిన ఫోటోను గుర్తు చేసుకున్నారు. సర్పంచిగా తనకు ఎంతో అండగా ఉంటూ రాజకీయంగా ఆర్థికంగా సేవలు అందించారని గుర్తు చేశారు. ఆ కుటుంబానికి భగవంతుడు ధైర్యం కల్పించాలని అన్నారు.

## రాజయ్యపేటలో ఇంటింటి టిడిపి కి స్పందన



**నక్కపల్లి : ఆగస్టు 29 ( మీ వార్త ప్రతినిధి )** ఇంటింటా టిడిపి కార్యక్రమంలో భాగంగా మండలం లోని రాజయ్యపేట గ్రామంలో విశేష స్పందన లభించింది. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో సొసైటీ అధ్యక్షులు పిక్కి కోదండరావు 189వ బూత్‌లో 557 కుటుంబాలను కలిసి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు . కోదండరావు ప్రథమంగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు.రాజయ్యపేట గ్రామానికి రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి వంగలపూడి అనిత సహకారంతో అందుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయం తదితర అంశాలను ప్రజలకు కోదండరావు తెలియజేశారు. గ్రామానికి మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న నేపథ్యంలో ప్రజల్లో ప్రభుత్వంపై మంచి నమ్మకం ఉందని అన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాజయ్యపేట గ్రామ అభివృద్ధికి చూపించిన చొరవ మరువలేనిదని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి వాసుపల్లి శివ, దేవుడు, చోడిపల్లి అప్పలరాజు, చొక్కా గోపి, కారే రాజు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం!



**తాడేపల్లిగూడెం, ఆగస్ట్ 29 (మీ వార్త ప్రతినిధి)** స్థానిక డి. ఆర్. గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవహారిక భాష కోసం గిడుగు రామమూర్తి చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలుగు భాషా గొప్పతనాన్ని సామాన్యులకు అందించడంలో వ్యవహారిక భాష ఎంతో దోహదం చేసిందని అన్నారు. ప్రధాన అతిథి బంగార్రాజు తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.తెలుగు శాఖ అధిపతి సుంకర గోపాల్, తెలుగు అధ్యాపకులు రామచంద్రుడు మాట్లాడుతూ భాషా దినోత్సవ ప్రాముఖ్యాన్ని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆన్లైన్ లో నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు పది వేల రూపాయల విలువైన బహుమతులను ఈ సందర్భంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ రామాలయం పునః నిర్మాణానికి -రెండు లక్షలు అందజేసిన మాజీ జడ్పిటిసి చైర్మన్ నామన రాంబాబు



**మగటపల్లి ఆగస్టు 29(మీ వార్త విలేఖరి రవి).** మగటపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రామాలయం పునః నిర్మాణం జరుగుతున్న సందర్భంగా ఆలయ నిర్మాణం కొరకు నామన ఫౌండేషన్ ద్వారా నామన ఫౌండేషన్ చైర్మన్ మరియు జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ శ్రీ నామన రాంబాబు ఆలయ కమిటీ వారికీ 2 లక్షలు రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోలిశెట్టి వెంకటేశ్వర రావు (తాత) బోలిశెట్టి మాధవ పిల్లా శ్రీనివాస్ సూరిశెట్టి కాశి విశ్వనాధం బోలిశెట్టి సత్యనారాయణ మూర్తి బోలిశెట్టి సతీష్ బోలిశెట్టి ఏసుబాబు నామన నాగేశ్వరావు కుంపట్ల బాబ్జి చెల్లింగి సింహాచలం భూపతి శ్రీను కుంచే శ్రీనివాస్ నామన ఆంజనేయ స్వామి నాయుడు కట్టా చంటి కట్టా సంపద రావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అద్దేపల్లి ప్రభుత్వ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



**పాలకొల్లు ; ఆగస్టు 29 మీ వార్తా జిల్లా ప్రతినిధి.** శ్రీ అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించబడ్డాయి.వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి తెలుగు విభాగాధిపతి డా బూసి వెంకటస్వామి అధ్యక్షత వహించగా, కళాశాల ప్రిన్సిపాల్ డా కె రత్నమాణిక్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి అతిథులందరూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి, ప్రిన్సిపాల్ డా కె రత్నమాణిక్యం మాట్లాడుతూ, మాతృభాష అయిన తెలుగును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆధునిక కాలంలో ఆంగ్ల భాషా ప్రభావం పెరుగుతున్నప్పటికీ, మన సంస్కృతి, సంప్రదాయలకు అలంబనగా నిలిచిన తెలుగు భాషా ప్రాధాన్యతను యువత మరువకూడదని పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ భావవ్యక్తీకరణను మాతృభాషలోనే మరింత సృజనాత్మకంగా చేయగలరని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి శక్తిగా మారితే ఎటువంటి అద్భుత ఫలితాలు సాధించవచ్చో వెంకట రామమూర్తి పంతులు నిరూపించారన్నారు.గ్రాంథిక భాషా వాదుల వాదనా పటిమను ఢీ కొట్టి వ్యవహారిక భాషను ప్రజలు చెంతకు చేర్చిన మహనీయుడని, తెలుగు భాషకు వెలుగులు అద్దిన అక్షర తపస్వి గిడుగని కొనియాడారు. ఒకవైపు తెలుగు భాషకు మరొకవైపు సవర భాషకు వెలుగులు నింపి భాషా చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. సభాధ్యక్షులు, తెలుగు విభాగాధిపతి డా బూసి వెంకటస్వామి మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి గ్రంథస్థ భాషకే పరిమితమైన తెలుగును సామాన్యుడి చెంతకు చేర్చి,వ్యావహారిక భాషను పల్లకీలో ఊరేగించిన భాషా పరిరక్షణోద్యమ పితామహుడన్నారు.విద్యార్థులు తెలుగు సాహిత్యంపై పట్టు సాధించి, నిరంతరం భాషా వికాసానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు .ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన వైస్ ప్రిన్సిపాల్ శ్రీ టి. కృష్ణ, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీమతి జి సుమలత, జె కె సి కోఆర్డినేటర్ శ్రీ కె శామ్యూల్, జంతు శాస్త్ర విభాగాధిపతి డా ఎం రామకృష్ణ,అర్థశాస్త్ర విభాగాధిపతి డా వి డి వి విజయలక్ష్మి లు మాట్లాడుతూ తెలుగు భాషా గొప్పదనాన్ని, నిత్య జీవితంలో మాతృభాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి, తమ సందేశాలతో స్ఫూర్తినింపారు.ఈ కార్యక్రమంలో జంతు రసాయన శాస్త్ర విభాగాధిపతి శ్రీ వంశీ సుబ్బరాయన్, వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీ పితాని శ్రీనివాసరావు, శారీరక విద్యా సంచాలకులు శ్రీ దుర్గారావు, లైబ్రేరియన్ శ్రీ రమేష్, అధ్యాపకులు జి డి శ్రీనివాసరావు,శిరీష, జ్యోత్స్న,హెప్సిబా రాణి, మన్మథరావు, స్వర్ణలత, ఆశా జ్యోతి, రోహిత్ కుమార్,మాధురి,యం శిరీష తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి

ఏపీ నిట్ డీన్ పరిశోధన, సంప్రదింపుల విభాగం డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి




**తాడేపల్లిగూడెం ఆగస్టు 29 (మీ వార్త ప్రతినిధి)** విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ఏపీ నిట్ డీన్ పరిశోధన, సంప్రదింపుల విభాగం డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ నిట్ డీన్ విద్యార్థి సంక్షేమ విభాగం డాక్టర్ కె.హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీన్ పరిశోధన, సంప్రదింపుల విభాగం డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాకీ క్రీడాకారుడు, మేజర్ ద్యానచంద్ చిత్రపటానికి పులమాలలువేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని చెప్పారు. క్రీడలు క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడలు, వ్యాయామం వంటి శారీరక కార్యకలాపాలకు కేటాయించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవటంతోపాటు ఒత్తిడిని తగ్గించుకోవచ్చని వివరించారు. డీన్ విద్యార్థి సంక్షేమ విభాగం డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తినిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి దేశానికి, విద్యాసంస్థకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా ఆచార్యులు శీనివాసన్ వ్యవహరించారు. వివిధ క్రీడా పోటీల్లోఅద్భుత ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచిన పలువురు క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. అనంతరం ప్రాంగణంలోని పరిపాలనా భవనం నుంచి ఏపీ నిట్ తూర్పు ముఖద్వారం వరకు నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సాస్ సహాయకులు కె.వీర వెంకట సాయిరాం ప్రసాద్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు 1 టౌన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య ల నివారణ,





ఏలూరు 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మెయిన్ బజార్లో ఏలూరు 1 టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీ కె రామ కృష్ణ గారు ఎస్ఐ లు సుధాకర్ గారు రామ కృష్ణ గారు మరియు వారి యొక్క సిబ్బంది తో కలిసి ఈ రోజు అనగా 29.08.2026 వ తేదీ నాడు ఫుట్ పెట్రోలింగ్ (విజిబుల్ పోలీసింగ్) నిర్వహించి ఆక్రమ ణల తొలగింపు, వ్యాపారులకు పోలీసుల హెచ్చరిక

పాదచారుల భద్రత మరియు శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా, ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ వారు ఏలూరు డీఎస్పీ శ్రీ డి. శ్రావణ్ కుమార్ గారి యొక్క ఆదేశాలపై ఏలూరు వన్ టౌన్ పోలీసులు శుక్రవారం 29.08.2026 ఏలూరు 1 టౌన్ ఇన్స్పెక్టర్ గారు వారి యొక్క సిబ్బంది తో కలిసి 'ఫుట్ పెట్రోలింగ్' నిర్వహించారు.

ఏలూరు 1 టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీ కె. రామకృష్ణ ఎస్.ఐలు శ్రీ రామ కృష్ణ శ్రీ సుధాకర్ మరియు సిబ్బందితో కలిసి నగరంలోని ప్రధాన వ్యాపార కేంద్రమైన మెయిన్ బజార్లో కాలినడకన గస్తీ నిర్వహించారు.

మెయిన్ రోడ్డుపైకి విస్తరించి, వాహనాల రాకపోకలకు మరియు పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగి స్తున్న దుకాణాల ఆక్రమణలపై పోలీసులు కఠినంగా వ్యవహరించారు. మెయిన్ బజార్ లోని పలువురు వ్యాపారులు తమ వస్తువులను, బోర్డు లను రోడ్డుపైకి పెట్టడం వల్ల నిరంతరం ట్రాఫిక్ జాం అవుతోందని ఇన్స్పెక్టర్ గారు గుర్తించారు. సదరు వ్యాపారులందరికీ రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు.

ప్రతి వ్యాపారి తమ దుకాణ పరిమితికి హద్దుల లోబడే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా హద్దులు దాటి రోడ్లను ఆక్రమిస్తే, అటు వంటి వారిపై భారీ జరిమానాలు విధించ డమే కాకుండా, సామాగ్రిని జప్తు చేస్తామని హెచ్చరించారు.

పోలీసుల ఆదేశాల మేరకు స్పందించిన వ్యాపారస్తులు వెంటనే రోడ్డుపైకి విస్తరించిన తమ దుకాణాల సామాగ్రిని వెనక్కి సర్దుకున్నారు. అత్యంత రద్దీగా ఉండే మెయిన్ బజార్లో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ ద్వారా ఆక్రమణలను క్రమబద్ధీకరించి, ట్రాఫిక్‌ను సుగమం చేయడంపై నగర ప్రజలు, పాదచారులు మరియు వాహన దారులు హర్షం వ్యక్తం చేశారు.

ఏలూరు వన్ టౌన్ పోలీస్ శాఖ స్పష్టం చేస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు మరియు ఫుట్ పెట్రోలింగ్ నిరంతరం కొనసాగుతాయని తెలియ చేసినారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

క్రీడలతోనే శారీరక దృఢత్వం.. క్రమశిక్షణ, సమష్టి కృషి అలవాటు

నల్లకుంట గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఉత్సాహంగా క్రీడా పోటీలు





**ఎటపాక, ఆగస్టు 29 (మీ వార్తా విలేఖరి** హాకీ దిగ్గజం, భారత క్రీడా రంగంలో చిరస్మరణీయుడైన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను శనివారం ఎటపాక మండలం నల్లకుంటలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు వివిధ క్రీడా పోటీలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. అథ్లెటిక్స్, క్రికెట్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీతో పాటు పలు సాంప్రదాయ ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కేవలం విద్యాభ్యాసానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సమష్టి కృషి, క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే క్రీడా దినోత్సవం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి సీతారాములు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగిరెడ్డి, గణపతి, రామదాసు, ఉపాధ్యాయులు మోహన్‌రావు, రామకృష్ణ, విజయకుమార్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## రాజోలు బాయ్స్ హాస్టల్ నీ వెంటనే పునర్ నిర్మించాలి అని కోరుతూ ఎమ్మెల్యే కలిసిన ఎస్సీ వెల్ఫేర్ సంఘం



**మలికిపురం ఆగస్టు 29 (మీ వార్త విలేఖరి రవి)** ఈరోజు మలికిపురంలో గౌరవ శాసనసభ్యులు దేవ వరప్రసాద్ గారిని రాజోలు నియోజకవర్గం ఎస్సీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో కలిసి వనతి పత్రం అందజేయడం జరిగింది

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పాలమూరు శ్యాంబాబు ప్రధాన కార్యదర్శి రాపాక మహేష్ ట్రజర్ గడ్డం తులసి భాస్కర్ నాలుగు మండలాల అధ్యక్షులు గొల్లమందుల చిట్టిబాబు గడ్డం ఫిలిప్పీ రాజు మట్టా సురేష్ నితిపూడి మహేష్, గెడ్డం సింహ పల్లంరాజు గెడ్డం పేర్రాజు, నల్లి శివ, గెడ్డం ప్రభాకర్ రావు, తాడి సత్యనారాయణ, తాడి సహదేవ్ గుర్రం జాషువా నల్లి బన్ను , కలిగితి బుల్లియ్య నల్లి వెంకటేశ్వర్లు నక్క రామారావు తదితరులు పాల్గొన్నారు

## డాక్టర్ కోడె వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్లో ఘనంగా మాతృభాషా, క్రీడా దినోత్సవాలు



**తాడేపల్లిగూడెం ఆగస్టు 29 (మీ వార్త ప్రతినిధి)** కడకట్లలోని డాక్టర్ కోడె వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ శశికళ హాజరయ్యారు. ముఖ్య వక్తగా జయహో పత్రిక సంపాదకులు పైలు శ్రీనివాసరావు ప్రసంగించారు. తెలుగు భాష గొప్పతనాన్ని, గిడుగు వెంకట రామ్మూర్తి చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అలాగే మేజర్ ధ్యాన్ చంద్ గొప్పతనాన్ని, క్రీడల ప్రాధాన్యతను తెలిపారు.

అనంతరం వివిధ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగు సబ్జెక్టులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.వి. కృష్ణారావు, తెలుగు ఉపాధ్యాయురాలు యంత్రపాటి ధనలక్ష్మి,వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్. నాగేంద్రబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

**డీసీసీ అధ్యక్షుడిపై బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ తిరుగుబాటు!**

**అదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నరేష్ జాదవ్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పార్టీలో తనకు తగిన గుర్తింపు, విలువ ఇవ్వడం లేదని, నరేష్ జాదవ్ ప్రతి విషయంలోనూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ పార్టీ నేతలను విస్మరిస్తున్నారని ఆరోపిస్తూ ఆయన అధిష్ఠానం వద్ద తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు.?శనివారం ఉదయం ఆడే గజేందర్ తన అనుచరులు, పార్టీ ముఖ్య కార్యకర్తలతో కలిసి భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అక్కడ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను నేరుగా కలిసి జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై ఫిర్యాదు చేయనున్నారు. ముఖ్యంగా ఇటీవల ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ పీఏసీ కమిటీలో తనకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై గజేందర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీనికితోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్ల ఎంపిక ప్రక్రియలో బోథ్ నియోజకవర్గానికి చెందిన ఆశావహుల పేర్లను పక్కనబెట్టి, డీసీసీ అధ్యక్షుడు తన

# జగన్ పరిపాలన కాదు.. సజ్జల ముఠా పరిపాలించారు

**హైదరాబాద్ :** వైసీపీ తనపై నమ్మద్రోహి అని తప్పుడు ప్రచారం చేస్తుందని అందుకే కొన్ని విషయాలపై క్లారిటీ ఇస్తున్నానంటూ ఆ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి బహిరంగ లేఖ రాశారు. ఇందులో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019 వరకు పార్టీలో జగన్‌దే నెంబర్ వన్ పొజిషన్‌గా ఉండేదని, కానీ సజ్జల వచ్చాక పరిస్థితులు మారిపోయాయని అన్నారు. ఇప్పుడు జగన్ రెండో స్థానంలో ఉన్నారని, పార్టీని సజ్జల లీడ్ చేస్తున్నారని ఆరోపించారు. అక్కడ ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా సజ్జల మాట చెల్లుబాటు అవుతుందని, జగన్‌ది ప్రేక్షక పాత్రేనని విమర్శించారు. విజయసాయి రెడ్డి రాసి పూర్తి లేఖ యథావిధిగా ఇక్కడ చదువుకోవచ్చు. “వైయస్సార్సీపీ “కోటరీ” నా మీద “నమ్మక ద్రోహి” అంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచార పోస్టులు పెట్టిస్తున్నందున ఈ బహిరంగ లేఖ రాస్తున్నాను. నమ్మకద్రోహినే అయితే ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్తో సంధి చేసుకుని, సీబీఐ, ఈడీ చార్జిషీట్‌లో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. జగన్‌కి నమ్మకస్తుడిని అనే ఒకే ఒక్క కారణంగా జగన్‌తో పాటు ప్రతి చార్జిషీట్లోనూ నన్ను ఎ-2గా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేర్చింది. జగన్‌ను 16 నెలలు జైల్లో ఉంటే నన్ను 15 నెలలు జైల్లో పెట్టారు. నమ్మక ద్రోహం నా రక్తంలో ఉంటే, అప్పుడే అప్రూవర్గా మారేవాడిని. 2024 ఎన్నికల తర్వాత కూడా నాకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో నన్ను ఎ-5గా చేర్చారు. కాకినాడ సీపోర్టు కేసులో ఏ-2 గా చేర్చారు. ఈ రెండున్నర ఏళ్ల టీడీపీ పాలనలో “సకల శాఖల మంత్రి” పేరు మాత్రం ఇంతవరకు ఏ చార్జిషీట్లోనూ లేదు. జగన్‌కి వెన్నుపోటు పొడుస్తూ, ఆయనకు తెలవకుండా టీడీపీతో కలిసి ఎలా పని చేయాలో, ఏ కేసులూ లేకుండా ఎలా చేసుకోవాలో అక్కడ ఉన్న “కోటరీ నాయకుడు”కి తెలిసినంత నాకు తెలవదు. నేను ఏనాడూ అలాంటి నమ్మక ద్రోహం పనులు చేయలేదు. ఇప్పుడు పార్టీ మారటానికి రెడీగా ఉన్న “ఉత్తరాంధ్ర నాయకుడు”తో కలిసి ఈ కోటరీ నాయకుడే 2020నుంచి జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా, నా మీద విపరీతంగా చాడీలు చెప్పించి నన్ను ఉత్తరాంధ్ర బాధ్యతలనుంచి తప్పించటానికి కారణం అయ్యాడు. జగన్ మెప్పు పొందడానికి నాస్తికుడుగా, కమ్యూనిస్ట్ గా చెప్పుకునే ఇతను వైఎస్సీపీకే కాదు, రాష్ట్రానికే నమ్మకద్రోహి. కుటుంబం కోసం 40ఏళ్ళు అత్యంత నమ్మకస్తుడిగా పని చేసిన నేను, నా ఆత్మగౌరవానికి 2020 నుంచి భంగం కలిగించింది ఎవరు? నన్ను పీఎంవోలో కాని, ఢిల్లీలో కాని, పార్టీలో కాని, అవమానకరంగా అంచలంచెలుగా తగ్గించింది ఎవరు ? పొమ్మనలేక పొగ పెట్టింది ఎవరు? అతిపెద్ద 2019 ఎన్నికల విజయం తర్వాత సజ్జల ప్రమేయం ఎలా శృతి



మించింది. పార్టీకి నా సేవలు ఏంటి, సజ్జల ద్రోహం ఏంటి? పరిపాలన జగన్ చేశారా?, “సజ్జల” సకల శాఖ మంత్రిగా, ఒక రాజ్యాంగేతర శక్తిగా తన ముఠాతో చేసిన పాలనలో, జగన్‌ని, ఎలా ఎవ్వరిని కలవకుండా, మంత్రులకు సహితం అపాయింట్మెంట్‌లు లేకుండా గోడ కట్టింది ఈ సజ్జల కాదా? కార్యకర్తలు, నాయకులు, పార్టీ కోసం పనిచేసేవారు, ఈ సజ్జల కింద పని చేయల్నా? ఇది జగన్ ని నమ్మి పని చేద్దామని ఉన్న వారికి పట్టిన ఖర్మ కాదా ? జగన్ని నమ్మి పని చేసే సీనియర్లు, నాయకులు, కార్యకర్తలు 2029లో మరోసారి పార్టీ ఓడిపోతే సజ్జలని తిట్టుకుంటూ రాజకీయాల నుంచి రిటైర్ అయిపోవాల్సిందేనా? నా సంగతి తర్వాత... కుటుంబ సభ్యులు సైతం దూరం అయింది. ఈ ప్రబుద్ధుడు సజ్జల వలన కాదా ?ఒక పెద్దిరెడ్డి, ఒక బొత్స, ఒక వైవీ సుబ్బారెడ్డి, ఒక మిథున్ రెడ్డి, ఒక సాయిరెడ్డి అందరూ రీజినల్ కోఆర్డినేటర్స్ గా, సజ్జలని రాష్ట్ర పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ గా మమ్మల్ని మానిటర్ చెయ్యాలని, మేమంతా ఆయనకు రిపోర్ట్ చెయ్యాలన్న ఆదేశాలు మిగతా నాయకులకు ఆమోదయోగ్యమో నాకు తెలియదు కానీ, నాకు మాత్రం కాదు. అందుకే నా ఆత్మగౌరవాన్ని చంపుకుని పని చేయలేక ... 4సంవత్సరాల రాజ్యసభ పదవీ కాలాన్ని వదులుకొని , వైసీపీ గుర్తుపై ఎన్నికైనందుకు నైతికసూత్రాన్ని పాటిస్తూ రాజీనామా చేయడం జరిగింది. జగన్ ని నేను రెండు సంవత్సరాలు నోరు తెరచి ఒక్క మాట మాట్లాడలేదు. కోటరీ కారణంగా నాకు జరిగిన అవమానాల కారణంగా బయటకు వచ్చా అని పదేపదే చెప్పాను. అయినా, అదే కోటరీ వారంతా, ఈ రోజు నేను పార్టీ పెడతానంటే నన్ను విమర్శిస్తున్నారు. నేను నేరుగా గెలిచేందుకే ప్రజాస్వామ్యబద్దంగా యుద్ధం చేస్తా... అంతే గాని, అప్పట్లో ప్రభుత్వాన్ని, ఇప్పుడు పార్టీని కబ్జా చేసి, జగన్ ని రోజు మోసం చేస్తూ కోవర్ట్ రాజకీయం చేయడం నాకు చేత కాదు. ఇది విజయసాయి రెడ్డిగా నా మాటజగన్ పెట్టుకున్న రెండు అంచల వ్యవస్థలో అనేక విషయాల్లో నా ఆత్మాభిమానం మీద కొడుతుంటే తట్టుకోలేకపోయాను. అంతకు ముందు, మంగళగిరిలో 2022లో జరిగిన పార్టీ ప్లీనరీలో నేరుగా ఈ సకల శాఖ మంత్రి నా మీద డైరెక్టుగా, భౌతికంగా దాడి చేస్తే జగన్ కి తెలిసి ప్రేక్షకపాత్ర వహించారు. ఈ విషయం పార్టీలో అక్కడున్న నాయకులు కూడా చూశారు. ఇవన్నీ తెలిసి కూడా అప్పటికే అతడి చేతిలో బందీ అయిపోయిన జగన్, నన్ను పూర్తిగా పక్కన పెట్టేందుకు, 2022లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, సమన్వయకర్తల మీటింగ్‌లలో “సాయన్న వయసు అయిపోయింది - ముసలోడు అయిపోయాడు” అంటూ అనుబంధ సంఘాల ఇంచార్జ్ బాధ్యతలు తప్పిస్తూ మాట్లాడారు. ఆ తర్వాత గుంటూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లా వరకు ఉన్న ఇంచార్జ్ భాద్యతలను తప్పించారు. కోర్ కమిటీలో నుంచి తొలగించారు. నేను నమ్మకస్తుడినే అయినా నా మీద ఇలా టార్గెట్ చేయించటంలో కోటరీ సక్సెస్ అయ్యింది. ఇలాంటి అవమానాలు మొత్తం 74 ఉన్నాయి. అవమానాలకు గురైనా, కడుపులోనే దాచుకున్న విషయాలు అనేకం ఉన్నాయి. 2020 వరకు జగన్ దృష్టిలో నా మాటకు ఎంతో విలువ ఉండేది. అదే కోటరీ కడుపు మంటకు కారణం అయింది. నేను ఎప్పుడూ కోటరీలో లేను. నేను ఢిల్లీలో జగన్ ఆదేశాల మేరకు పని చేయటంలో బిజీగా ఉంటే, సకల శాఖల మంత్రి జగన్ తోటే ఉండి నన్ను పడగొట్టే కార్యక్రమంలో బిజీగా ఉండేవాడు. ఇప్పుడు ఆ వైసీపీ పార్టీలో నంబర్ 2 ఎవరంటే జగన్. ఇప్పుడు నంబర్ వన్ ఎవరంటే “సకల శాఖల మంత్రి సజ్జల”. ఆ పార్టీ గెలుస్తుందా... ఓడుతుందా ప్రజలు నిర్ణయిస్తారు. కానీ, నిరంతరం ఆ కొత్త నంబర్ వన్ ఆదేశాలకు తలవంచి ఇప్పుడున్న సీనియర్ల మాదిరిగా నేను సర్దుకుపోలేను. అతనికి నమస్కారాలు/సాష్టాంగాలు/దండాలు పెట్టలేను. ఇక అక్కడ ఉండలేని పరిస్థితి వచ్చింది. 2024 ఎన్నికల తర్వాత, ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. అందువల్లే పార్టీకి, నా రాజ్యసభ పదవికి కూడా రాజీనామా చేశాను. ఇప్పుడు వేరే పార్టీ పెడుతున్నాను. నేను జగన్‌కు నమ్మక ద్రోహం చేయలేదు. చేయను. పార్టీలో ఉండి, ఎవరు కోవర్టుగా పని చేస్తున్నారో, ఎవరు నమ్మక ద్రోహం చేస్తున్నారో వైయస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలు, జగన్ అభిమానులు ఆలోచన చేసుకోవాలి. ఈ నిజాలు చెప్పకపోతే, విమర్శలు మాత్రమే ప్రచారంలోకి వస్తున్నాయి. మరో సందర్భంలో మీడియా ద్వారా మరిన్ని నిజాలు తెలియజేస్తా.” అని ముగించారు.

# కాంగ్రెస్‌లో చేరికలు

**జయశంకర్ భూపాలపల్లి.** జయశంకర్ భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో చిట్యాల మండలంలోని బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన రామచంద్రాపూర్ సర్పంచ్ గాజా హేమలత అశోక్, కైలాపూర్ గ్రామ సర్పంచ్ కోదారి ఓదెలు తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు,ప్రజల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల ముఖ్య నాయకులు, సర్పంచులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి,రైతు సంక్షేమం, మహిళల సాధికారత, పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను విజయవం తంగా అమలు చేస్తోందని అన్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు తమ గ్రామాల అభివృద్ధికి మరింత సేవ చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి భూపాలపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరపున స్వాగతం పలుకుతూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కీర్తిని అంతర్జాతీయ వేదికపై చాటనున్న అక్షిత

## జాతీయ స్థాయిలో స్వర్ణం. ఏషియన్ పోటీలకు భారత జట్టులో స్థానం

**కరీంనగర్ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, చింతకుంట జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆకుల అక్షిత భారతదేశం తరపున ఏషియన్ త్రోబాల్ పోటీలకు ఎంపికై అరుదైన ఘనత సాధించింది. గత నెలలో తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో నిర్వహించిన జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున పాల్గొన్న ఆకుల అక్షిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జట్టుకు బంగారు పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించింది. జాతీయ స్థాయిలో ఆమె చూపిన అత్యుత్తమ ప్రదర్శనను గుర్తించిన ఎంపిక కమిటీ అక్షితను భారత జట్టుకు ఎంపిక చేసింది. శ్రీలంకలోని నిగాంబో ఇండోర్ స్టేడియంలో నవంబర్ 19 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న ఏషియన్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో ఆకుల అక్షిత భారతదేశం తరపున పాల్గొననుంది. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో చింతకుంట గురుకుల పాఠశాల, కళాశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఆకుల అక్షిత సాధించిన ఈ ఘనత పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ఎ. లక్ష్మీ మేడం, జోనల్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, పీడీ సుష్మా మేడం, పీఈటీ సుజాత మేడం, కోచ్ సతీష్తో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందడం ఎంతో గర్వకారణమని తెలిపారు. శ్రీలంకలో జరిగే ఏషియన్ పోటీల్లో కూడా ఆకుల అక్షిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భారతదేశానికి పతకం



తీసుకురావాలని ఆకాంక్షించారు. చిన్న వయసులోనే

## శ్రీ బాల బాలాజీ స్వామి నిత్య అన్నప్రసాద ట్రస్ట్ కి - 2,50,001 విరాళము సమర్పించిన- పిచ్చిక విజయ జగదీశ్వర కుమార్



అప్పనపల్లి ఆగస్టు 29(మీ వార్త విలేఖరి రవి).
శ్రీ పిచ్చిక విజయ జగదీశ్వర కుమార్, శ్రీమతి ఉమామహేశ్వరి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు, శ్రీ బాల బాలాజీ స్వామి వారిని దర్శించి శ్రీ స్వామివారి నిత్య అన్న ప్రసాద ట్రస్ట్ కు ?. 2,50,001/-లు విరాళముగా సమర్పించారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేయగా, దేవస్థానం సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.రాంబాబు రెడ్డి గారు శ్రీ స్వామివారి చిత్రపటము మరియు ప్రసాదములు అందజేసినారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారు ఒక భక్తుని కోరిక మేరకు అప్పనపల్లి గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ బాల బాలాజీ స్వామి వారునీ నిత్యం వేలాదిమంది ప్రజలు దర్శించుకుంటారు

## ఆర్ బి కే కేంద్రం వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో పాల్గొన్న -మాజీ సర్పంచ్



### తాత కాపు

**మామిడి కుదురు ఆగస్టు 29 (మీ వార్త విలేఖరి రవి).**
లూటుకుర్రు గ్రామంలో ఆర్ బి కే కేంద్రం వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం లో పాల్గొని రైతులకు మందులు పంపిణీ చేస్తున్న గ్రామ మాజీ సర్పంచ్, పి గన్నవరం నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య మాజీ అధ్యక్షులు అడబాల తాతకాపు, కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొబ్బరి కాయలను మరియు వరి పంటను నాశనం చేయకుండా మందులు ఎంతగానో ఉపయోగం పడుతుంది అని రైతులు పంటలు ఎలుకలు నాశనం చేయకుండా ఉండాలంటే ఈ మందులు ఉపయోగించుకోవాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బికే సిబ్బంది మరియు రైతులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 22ఏ కోసం పోరుబాట

**హైదరాబాద్ :** తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పార్టీని బలోపేతం చేసుకునే దిశగా బీజేపీ ముందుకు సాగుతోంది. ఇటీవల విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ విజయవంతంగా దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం... తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా మరో రెండు ప్రధాన పోరాటాలకు సన్నద్ధమవుతోంఈ క్రమంలో నిషేధిత 22ఏ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల (సెప్టెంబర్) 5, 6 తేదీల్లో బీజేపీ నేతలు భారీ దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించేందుకు ఈరోజు నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మరోవైపు, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ లోని అసెంబ్లీ వరకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ ‘రైతు యాత్ర’ చేపడుతున్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది.

## ప్రోటోకాల్ రగడ...

**హైదరాబాద్ :** ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ/గృహలక్ష్మి ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ధ్వజమెత్తారు. తాను రాకముందే అధికారులు లక్కీ డ్రా ప్రారంభించడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్వయంగా డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఆయన రాకముందే అధికారులు ప్రక్రియను ప్రారంభించడంతో తీవ్ర అసంతృప్తికి గురైన దానం నాగేందర్ అధికారులపై మండిపడ్డారు. ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా, ప్రోటోకాల్ పాటించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని దానం నిలదీశారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నిరసనగా కార్యక్రమం మధ్యలోనే అలిగి వెనుదిరిగారు. కాగా, హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం నాలుగు రోజుల పాటు ఈ లక్కీ డ్రా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

## హరికృష్ణకు నివాళులు

**హైదరాబాద్ :** నందమూరి హరికృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియా వేదిక ‘ఎక్స్’ ద్వారా స్పందించిన వారు, హరికృష్ణతో తమకున్న అనుబంధాన్ని మరియు ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.”నాకు అత్యంత ఆప్తుడైన బావమరిది నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా నివాళులు” అని ముఖ్యమంత్రి చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, రాష్ట్ర మంత్రిగా హరికృష్ణ ప్రజాసేవలో పోషించిన పాత్ర మరువలేనిదని ఆయన కొనియాడారు. సినీ నటుడిగానూ తనదైన ముద్ర వేసిన హరికృష్ణ, తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని

Edited Printed Published & Owned by U. SHEKHAR. And Printed at Mani Raghava Printers, #A-20, Vambay Colony, Hyderabad, Rajendranagar, Rangareddy, Telangana.
Published at Manikanta Publications, H.No. 3-67/3/66, Netaji Nagar, Nallagandla, Serilingampally, Rangareddy (Dist), Telangana, EDITOR U.SHEKHAR, RNI. NO. TEL/2018/77112